# పురాణాలలో హరి-గిరి

# జన మనీషులు

బోయి భీమన్న

ప్రతులు - వెయ్యి

1995

వెల : రూ. 30/-

హక్కులు : రచయితవి

ప్రతులకు :

**భీమన్న సాహితీ నిధి**

ఇర్రం మంజిల్ కాలనీ, ఐ.సి. 85,

హైదరాబాదు - 82.

**ధర్మజ్యోతి,**

8-2-601/జి/25, గౌరీశంకర్ కాలనీ,

రోడ్ నెం. 11, బంజారాహిల్స్,

హైదరాబాద్ - 500 034.

ముద్రణ :

**పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్,**

1-1-517/బి/1, న్యూ బాకారం,

గాంధీనగర్, హైదరాబాద్ - 500 380.

ఫోన్లు : 611413, 600547.

350

పురాణాలలో హరి–గిరి

# జన మనీషులు

## ఆదిమూలం

అంబేడ్కరు గారి ఊహ ప్రకారం హరిజను లెవరంటే, మానవులు ట్రైబులుగా సంచరిస్తున్న పూర్వకాలంలో ప్రధాన ట్రైబు నుంచి వెనకబడిపోయి విడిపోయిన వాళ్ళు.

ట్రైబు అంటే చిన్న సముదాయం. ఒక ముఠా. ఒక వర్గం. చిన్న జాతి. ఒక గ్రూపు అన్నమాట.

ఆ కాలంలో ఒకే జాతి మానవులైనా అనేక గ్రూపులుగా విడిపోయి ఆహారాన్ని వెతుక్కుంటూ తలొక దారినా సంచరిస్తూ వుండేవాళ్ళు. ఏ గ్రూపుకు ఆ గ్రూపే సమగ్రంగా, సర్వ స్వతంత్రంగా వుండేది. అట్టి గ్రూపులనే అంబేడ్కరు గారు (Tribes) ట్రైబులు అన్నారు. అట్టి ట్రైబ్సు నుంచి విడిపోయిన వాళ్ళనే 'బ్రోకెన్ పీపుల్' (Broken People) అన్నారు.

ఈ బ్రోకెన్ పీపుల్‌ని విడిపోయిన వాళ్ళు, వేరుపడిన వాళ్ళు అనవచ్చు. దళితులు అని మాత్రం అనగూడదు. ఎందుకంటే, దళిత శబ్దానికి పతిత అనే రూఢి అర్థం వుంది. దళితులు అనడం కంటే నిమ్నులు అనడమే మేలుగా వుంటుంది. ఒక ప్రధాన జాతి నుంచి విడిపోయిన వాళ్ళు దళితులూ, పతితులూ కాబోరు. వాళ్ళు ప్రధాన జాతికే చెందిన వాళ్ళు కదా? ప్రధాన జాతి నుంచి విడిపోయారే తప్ప జాతి సంబంధంగా వాళ్ళూ, వీళ్ళూ ఒకటే.

అస్పృశ్యులుగా పరిగణించబడే హరిజనులను గురించి అంబేడ్కరుగారు చేసిన ఒక ఊహ ఇది. ఈ విషయంలో ఇంకా పరిశోధన జరగవలసి వున్నదని ఆయనే తన ''అస్పృశ్యులెవరు?'' అనే గ్రంథంలో పేర్కొని వున్నారు.

అయితే, నేటి హరిజన విద్యావంతులందరూ ఆయన చెప్పిన చోటనే

ఆగిపోయారు తప్ప, ముందుకు పోవడం లేదు. పరిశోధనలు చెయ్యడం లేదు. ఇదొక దురదృష్టకర విషయం.

హరిజనులెవరు? వాళ్ళ ఆదిమూలం ఏమిటి? వాళ్ళకు అంటరానితనం ఎలా వచ్చింది? అనే విషయంలో నేను మరొక దృక్కోణం నుంచి పరిశీలించడం సాగించాను. హైందవ సాహిత్యంలో ఏమి చెప్పబడింది? నేను మొదటి నుంచీ ఆ మార్గంలో పయనించాను.

ఇప్పుడు హరిజనులనబడుతున్న వారినే హైందవ వాఙ్మయంలో 'చండాలురు' అన్నారు. చండాల, శ్వపచ, పుల్కస, మాతంగ, పంచమ, మాల, మాదిగ, గోసంగి మొదలైన పేర్లన్నీ అస్పృశ్యులైన చండాలురకు పర్యాయపదాలుగానే వాడబడ్డాయి. పూర్వ సాహిత్యం దృష్టిలో ఈ అందరూ ఒకటే కులం. అస్పృశ్యకులం. ఈ పేర్లలో తరచుగా వాడబడిన పేరు చండాల.

చండాల శబ్దానికి పూర్వ నిఘంటువులు, ముఖ్యంగా అమరకోశం ఇచ్చిన అర్థం – "చండాలస్తు జనితో బ్రాహ్మణ్యాం వృషలేనయ" అని. అంటే శూద్ర పురుషుని వలన బ్రాహ్మణ స్త్రీకి పుట్టిన సంతానం చండాలురు అనబడుదురు అని.

వృత్తులను బట్టి నాలుగు వర్గాలుగా పని విభజన చెయ్యబడిన వైదిక సమాజం క్రమంగా జన్మనుబట్టి కులాలుగా విడిపోయి హైందవ సమాజంగా మారినప్పుడు కులాంతర స్త్రీ పురుష సంబంధాలవల్ల ఎన్నో కొత్త కులాలు పుట్టుకొచ్చినై.

ఈ కొత్త కులాల వాళ్ళనే 'సంకరులు' అన్నారు. ఇతర కులాల సంకరులు తేలిక శిక్షలతో వదలివేయబడగా శూద్ర బ్రాహ్మణ సంకరులకు మాత్రం కఠినాతి కఠినమైన "వెలి – అంటరానితనం" శిక్ష విధించబడింది. అందుకు కారణం – చివరి కులమైన శూద్రులతో అతి అగ్రకులమైన బ్రాహ్మణుల సంబంధాన్ని ప్రోత్సహించకూడదనేదే.

ఆ విధంగా వెలివేయబడిన తొలి చండాలుడు మతంగుడు. ఇందుకు సంబంధించిన వివరాలు నా రచనల్లో చాలచోట్ల పేర్కొని వున్నాను.

ఈ మతంగుడు తొలి సాంఘిక విప్లవకారుడు. ఆయనతో గిరిజన

ప్రముఖుడైన ధర్మవ్యాధుడు వియ్యమందడంవల్ల, హరిజన, గిరిజన తెగలు రెండూ ఏకమై దేశమంతా విస్తరించాయి.

కుల వ్యవస్థను ఏర్పరచుకొన్న ప్రధాన హైందవ సమాజం "సవర్ణులనీ", అట్టి వ్యవస్థ లేని హరిజనులు "అవర్ణులనీ" పిలువబడ్డారు. ఈ అవర్ణులలో రెండు తెగలున్నారు. ఒక తెగ ప్రధాన గ్రామాన్ని (సవర్ణులను) అంటిపెట్టుకుని వున్న హరిజనులు, రెండవ తెగ అరణ్యాలలో వుండిపోయి స్వేచ్ఛగా బ్రతుకుతున్న గిరిజనులు.

అందులోనూ హరిజనుల నుంచి అడవులకు పారిపోయేవాళ్ళు, గిరిజనుల నుంచి గ్రామాలకు వచ్చి చేరే వాళ్ళు ఎక్కువగానే వుంటూ వుండే వాళ్ళు.

అందుకే నేను హరిజనులనూ, గిరిజనులనూ కలిపేశాను. ఒకే జాతిగా నిర్వచించాను. ధర్మవ్యాధ, మతంగ బాంధవ్యం కూడ నా విధానానికి తోడ్పడింది.

ఇప్పుడు అంబేడ్కరు చెప్పిన మార్గంలో పరిశోధన జరగడం లేదు. ఎవరైనా జాతి అభ్యుదయం కోరే యువకులు అక్కడక్కడ పరిశోధనలు చేస్తున్నా, అట్టి పరిశోధనలు అంబేడ్కరు చుట్టూ మాత్రమే తిరుగుతున్నై. ముందుకు సాగడం లేదు.

ఇక నా మార్గంలో–

నేను నాకు సాధ్యమైనంత వరకూ దేవ, దానవ, మానవ వర్గాల పుట్టు పూర్వోత్తరాలను గురించీ, ఆర్యుల వర్ణ వ్యవస్థను గురించీ, హిందువుల కుల విభజన గురించీ, హరిజన గిరిజన వర్గాల ఆవిర్భావం గురించీ సమగ్రంగా పరిశోధించి ఎంతో సాహిత్యాన్ని సృష్టించి వున్నాను. చాల వరకు మంగిపూడి వెంకటశర్మగారి "నిరుద్ధ భారతం" గ్రంథాన్ని అనుసరించి, ప్రాచీన సాహిత్యాన్ని పరిశీలించి, యధార్థాలను బయటపెట్టి వున్నాను. నా సాహిత్య సృష్టికి అలాంటి పూర్వగాథలే కొంతవరకు వస్తు సామగ్రి అయ్యాయి.

అయితే నా సాహిత్యాన్ని చదివి మూల సత్యాన్ని గ్రహిస్తున్న హరిజనులు చాల తక్కువ. వీళ్ళకు తాత్కాలికమైన హక్కులు, ఉద్యోగాలు మాత్రమే ముఖ్యం.

ఇక, సవర్ణ హిందువులలో రజోగుణం, తమోగుణం మాత్రమే ప్రాధాన్యం వహిస్తున్నై. సాత్వికంగా ఆలోచించి, ఆర్ష, వైదిక సంప్రదాయాలను గుర్తించి,

నన్ను అర్థం చేసుకుని నా సాహిత్యాన్ని అవగాహన చేసుకొంటున్న వాళ్ళు బహుతక్కువ.

జాతీయ సమైక్యమో అంటూ అరిచేవాళ్ళలో కూడ జాతి అంటే ఏమిటో, సమైక్యం ఎవరి మధ్యనో తెలిసిన వాళ్ళు లేరు. పత్రికల వాళ్ళూ అంతే. పండితులూ అంతే. ప్రభుత్వ నాయకులూ అంతే. ఎవళ్ళ స్వప్రయోజనాలు వాళ్ళవి.

అయినా, నేను నిరుత్సాహపడడం లేదు. చెబుతూనే వున్నాను. వ్రాస్తూనే వున్నాను. పేద వాణ్ణయినా పుస్తకాలు ప్రకటిస్తూనే వున్నాను. అమ్మేవాళ్ళూ కొనేవాళ్ళూ లేకపోయినా, ఉచితంగా పంచి పెడుతూనే వున్నాను.

వేదాలు పట్టిన కాలంలో కుల వ్యవస్థ లేదు. ఇజ్రాయెలీ సమాజంలో వుండే కిబుట్జ్ (Kibbutz) అన బడే సోషలిస్టు వ్యవస్థే ప్రాచీన కాలంలో వైదిక సమాజంలోనూ వుండేది. దీనినే నేను నా సాహిత్యంలో 'ఉమ్మడిపొయ్యి' అన్నాను. 'శివ సోషలిజం' అని కూడా అన్నాను. సర్వోదయం అని సైతం అన్నాను.

వేద ఋషులందరూ ఎక్కడెక్కడో, ఎవరెవరికో పుట్టి, బ్రహ్మజ్ఞానం ద్వారా అగ్రగణ్యులైనవాళ్ళే. కుల వ్యవస్థ ఏర్పడుతూ వచ్చిన పురాణ కాలంలో కులాంతర స్త్రీ పురుష సంబంధాలవల్ల సంకర జాతులేర్పడి, వృత్తి వ్యత్యాసాలవల్ల హెచ్చు తగ్గులేర్పడి, వైదిక సోషలిస్టు సమాజం శిథిలమవుతూ వచ్చిన నాటి కాలంలోని నాకు తెలిసిన కొందరు హరిజన గిరిజన మహా మనీషులను గురించి క్లుప్తంగా ఇక్కడ చెప్పాను.

వీరిలో ఒక్కొక్కరి గురించీ ఒక్కొక్క పరిశోధక గ్రంథమే వ్రాయవచ్చు. వీరి గురించే కాక, మంగిపూడి వెంకటశర్మ గారి నిరుద్ధ భారతంలోని అనేక మంది హరిజన, గిరిజన మేధావుల గురించీ, ఋషుల గురించీ, యోధుల గురించీ, రాజుల గురించీ, కవి పండితుల గురించీ వేలకొలది పేజీల థీసీస్సులు వెలువరించవచ్చు. డాక్టరేటులు పొందవచ్చు.

ఈ నాటికి కూడా నన్నయ్యగారి బండిరాలు. నన్నయ్యగారి అరసున్నలు, నన్నయ గారి యతులు, నన్నయ్యగారి క్రియలు అంటూ వృధా పరిశోధనలు చేస్తున్నారే తప్ప, ఇటువంటి పురాణ పురుషుల పుట్టు పూర్వోత్తరాలను గురించి

పరిశోధన చేయడానికి ఎవరూ పూనుకోవడం లేదు. హరిజన యువకులైనా అందుకు పూనుకొంటారంటే వాళ్ళకు ప్రాచీన సాహిత్యంపట్ల ఆసక్తి కలగడం లేదు. ఈ హరిజన గిరిజన పుట్టుపూర్వోత్తరాలేమిటో, తమ ప్రాచీనత ఎప్పటిదో తెలుసుకొందామన్న జిజ్ఞాసే లేదు.

అందుకే నేనీ గ్రంథం వ్రాశాను. భవిష్యత్తు మీద అపారమైన ఆశతో వ్రాశాను. హరిజన, గిరిజన యువకులనే కాక, జాతిశ్రేయస్సే, జాతి సమైక్యమే, జాతి అగ్రేసరత్వమే ప్రధానంగా భావించే దేశభక్తులైన సవర్ణ విద్యావంతులను కూడ మేల్కొల్పడానికి వ్రాశాను.

ప్రపంచ జాతుల స్థాయికి మన జాతి పెరగాలంటే, పురోగమనం సాధించాలంటే ముందు మన గతం తెలియాలి. మన జవసత్వాలేమిటో తెలియాలి. మన గతంలోని జీవశక్తిని పునరుద్ధరించుకోవాలి. పునరుజ్జీవింప (Resurrect) చేసుకోవాలి.

జాతీయ సమైక్యం అంటే పులికీ, గోవుకూ స్నేహం సాధించడం కాదు. పులిని గోవు స్థాయికో, గోవును పులి స్థాయికో దించి సమానం చేయడానికి ప్రయత్నించడమూ వ్యర్థం. అట్టి ప్రయత్నం చేయడం తప్పకపోతే ముందుగా మన జాతి అంతర్విభేదాలను తొలగించుకోవాలి. ఏకజాతిగా సంఘటితం కావాలి. అందుకు గతం గురించిన పరిశోధన జరగాలి.

నేను కవిని కనుక పరిశోధనపై దృష్టిని కేంద్రీకరించలేదు. పరిశోధకులకు మార్గం చూపుతున్నానంతే.

ఇందులో ఆరుంధతి, వాల్మీకి, ధర్మవ్యాధుడు, వేద వ్యాసుడు గురించి నేను నాటకాలు కూడా వ్రాసి వున్నాను. మొదటి రెండూ ముద్రించబడి, జనాదరణ పొంది వున్నై.

అందరితోపాటు హరిజన సాహితీ కళాకారులను ప్రోత్సహించడం కోసం నేను ఎన్నో సాంస్కృతిక సంస్థలను కూడా నెలకొల్పడం, ప్రోత్సహించడం జరిగింది. అందులో జగ్జీవన్ కళా పరిషత్తు, సంస్కృతీ సంవర్ధక సమితి, సుఖేలా నికేతన్, విశ్వ సాహితి, ధర్మజ్యోతి వగైరా వున్నై. ఇందులో ధర్మజ్యోతి సాంస్కృతిక సంఘం సాహసోపేతమైన కార్యక్రమాలను నిర్వహించడం ప్రారంభించింది.

ఈ సంస్థ స్థాపక కార్యదర్శి శ్రీ దాకే శివాజీ యువకుడు, ఉత్సాహవంతుడు, జీవితంలో ఏదో సాధించాలనే దీక్ష, ఆసక్తి కలవాడు.

ఈ సంస్థ తొలి సమావేశంలోనే మంత్రులు కుతూహలమ్మ, పాటి రాజంగార్ల వంటి వారిని, నారాయణరావు ఐ.పి.ఎస్., ఎమ్.ఎన్.భూషిగార్ల వంటి ప్రముఖులను పాల్గొనేటట్టు చేసి సభను ఎంతో జయప్రదంగా నిర్వహించాడు.

1992లో నా 82వ జన్మ దినోత్సవాన్ని రవీంద్రభారతిలో నిర్వహించింది కూడా ధర్మజ్యోతే. శ్రీ శివాజీ ఆర్గనైజింగ్ నైపుణ్యం ఈ సందర్భంలో బాగా నిరూపితమైంది.

ఆచార్య సి.నారాయణరెడ్డిగారి అధ్యక్షతన జరిగిన ఈ సభలో మంత్రులు పి.రామ చంద్రా రెడ్డి, పాటి రాజంగార్లు; ఐ.ఎ.ఎస్. ఆఫీసర్లు బి.దానం, కె.మాధవరావు, టి.గోపాల రావు గార్లు; బొజ్జా తారకం, జస్టిస్ కె.పున్నయ్యగార్లు పాల్గొన్న విశిష్ట సభ అది. స్వర్గీయ బొజ్జా కృష్ణశాస్త్రికి అంకితమియ్యబడిన 'పాటలలో అంబేడ్కరు' అనే నా గ్రంథం ఆవిష్కరించబడిన సభ అది. ఉన్నతాధికారులు కమలేశ్వరరావు ఐ.ఎ.ఎస్., వేదయ్యగారు, సైదులు గారు మున్నగు ఎంతో మంది ప్రముఖులు తమ సహాయ ప్రోత్సాహాలను అందించిన సభ అది.

అట్టి వారందరికీ కృతజ్ఞతలు తెలపడంతోపాటు ఇప్పుడీ గ్రంథాన్ని ధర్మజ్యోతి సంస్థకూ, దాని వ్యవస్థాపక కార్యదర్శికీ, పోషక ప్రోత్సాహకులకు అంకితమిస్తున్నాను. ఇదొక కొత్త తరహా అంకితం. విద్యా, సాహితీ మనీషులైన సహృదయులు ఈ రంగంలో కృషిచేసి జాతి సమైక్యానికి తోడ్పడగలిగితే నేనెంతో ఆనందించగలను.

ఈ గ్రంథానికి ముఖచిత్రం వ్రాసిన అంబేద్కరు ఓపెన్ యూనివర్సిటిలోని ఆర్టిస్టు శ్రీ రమేష్ గారికి, పద్మావతీ ఆర్ట్స్ ప్రింటర్స్ వారికీ నేనెంతగానో కృతజ్ఞుడ్ని.

-భీమన్న

## ఇందులో..

ఆదిమూలం

| | | |
|---|---|---|
| 1. | నా పురాణం | 359 |
| 2. | మతంగుడు | 364 |
| 3. | ధర్మవ్యాధుడు | 368 |
| 4. | అర్జునికి | 372 |
| 5. | అర్జునకుడు | 375 |
| 6. | అరుంధతి | 378 |
| 7. | వాల్మీకి | 383 |
| 8. | గుహుడు | 387 |
| 9. | శబరి | 391 |
| 10. | హనుమ | 394 |
| 11. | జాబాలి | 398 |
| 12. | వీరబాహుడు | 400 |
| 13. | వేదవ్యాసుడు | 404 |
| 14. | ఏకలవ్యుడు | 408 |
| 15. | గురుమనీషి | 412 |
| 16. | పుల్కసుడు | 415 |
| 17. | సత్యతపుడు | 417 |
| 18. | పాశుపతబోయ | 419 |
| 19. | ఆహుక-ఆహుకుడు | 421 |
| 20. | భ్రాంతమతి | 422 |
| 21. | శివుడు | 424 |

# అంకితం

ధర్మజ్యోతి సాంస్కృతిక సంఘానికి

ఆ సంఘపు వ్యవస్థాపక కార్యదర్శి

## యువకరత్న దాకే శివాజీ

ఆ సంఘం తరఫున అనేకానేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న వందల కొలదీ కార్యకర్తలకూ, పోషకులకూ, ప్రోత్సాహకులకూ, మార్గదర్శకులకూ-

ముఖ్యంగా

శ్రీయుతులు జస్టిస్ కొత్తపల్లి పున్నయ్య, టి.గోపాలరావు ఐ.ఎ.ఎస్., బి.దానం ఐ.ఎ.ఎస్., కత్తి చంద్రయ్య ఐ.ఎ.ఎస్., ఎమ్.వి.నారాయణరావు ఐ.పి.ఎస్., కె.నరసింహం, కందికట్ల ప్రభుదాస్, కె.డి.జి.రాజశేఖరరావు, డా. బి.నాగవర్మ, ఎ.విద్యాసాగర్ ఐ.ఎ.ఎస్. గార్లకు.

★ ★ ★

# నా పురాణం

పురాణాలలో వర్ణించబడ్డ హరిజన, గిరిజన మహామనీషుల జీవితాలను గురించి క్లుప్తంగా చెపుదామనిపించి, ఈ రచనను మొదలు పెట్టాను. అయితే, పురాణ పురుషుల వర్గంలోకి నా పేరెలా వస్తుందను కొన్నాను ?

నా జీవితం రెండు భాగాలు - శారీరకం, మానసికం. శారీరకంగా నేను బ్రతుకుతున్న దెక్కువగా మాల మాదిగ పేటల్లోనే. వాటి నిప్పుడు హరిజన వాడలంటున్నాం. పేరు మారినా తీరు మార లేదు. అదే దారిద్ర్యం. అదే దీనత్వం, అదే దాస్య వృత్తి. వాటిని దళిత బస్తీలన్నా అదే దుస్థితి.

నే నిప్పుడు వాస్తవంగా భాగ్యనగరంలో ఉంటున్నప్పటికీ, నా కృషి అంతా భారతజాతి సమైక్యం కోసమే అయినప్పటికీ, నాకు ఎక్కువగా హరిజనుడు గానే తప్ప, భారతీయుడుగా గుర్తింపు రావటం లేదు. సవర్ణ విద్యావంతుల మెదళ్ళలో జ్ఞాన జ్యోతి వెలగడం లేదు.

నేనెక్కడ వున్నా, నా చుట్టూ వుంటున్నది హరిజన వాడే. మొత్తం మీద, కొన్ని మినహాయింపు లున్నప్పటికీ, సవర్ణ పత్రికలకు, సమీక్షకులకు, ప్రచురణ సంస్థలకు, విక్రయశాలలకు, న్యూసు రిపోర్టర్లకు, టీవీ లాంటి ప్రభుత్వ యంత్రాంగానికి కూడ నా గ్రంథాలు ఇంకా అంటరానివే.

ఈ రకమైన చిన్న చూపుకు కారణం అజ్ఞానమా, అహంకారమా అని ఆలోచిస్తే - రెండూ కారణాలే అనిపించింది నాకు.

సమర్థులలోని అహంకారాన్ని తొలగించాలంటే, అందుకు హరిజనులు రాజకీయంగా సంఘటితులు కావలసి ఉంటుంది. బలం కలవాడే రాజు అనేది

సార్వకాలిక సత్యం. బలం లేని వాళ్ళకు బానిస బ్రతుకులు తప్పవు. ఈ కాలంలో బలమంటే సంఘ బలమే.

ఇక అజ్ఞానం సంగతి - అజ్ఞానం ఉభయత్రా సమానమే. భారతీయ సంస్కృతికి జనక స్థానీయులైన వేద ఋషులంతా ఎవరు? ఈ నాటి హరిజనులకు పూర్వీకులే కదా? ఈ వాస్తవాన్ని ప్రజలలో శక్తివంతంగా ప్రచారం చెయ్యగలిగితే, అవర్ణ, సవర్ణ విద్యావంతులందరికీ ఒకేసారి జ్ఞానోదయం కాగలదు. అంటరాని తనమూ, కుల తత్వమూ అచిర కాలంలోనే అంతరించిపోగలవు - జాతి సమైక్యమై బలపడగలదు.

మరి అట్టి ప్రచారం ఎందుకు జరగటం లేదు? ప్రచార సాధనాలన్నీ సవర్ణుల చేతుల్లో ఉన్నాయి కాబట్టి ! ఇప్పటి సాంఘిక వ్యవస్థ ఇలాగే కొనసాగడం వాళ్లకు ప్రయోజనకరం కాబట్టి !

వేద కాలం నాటి నుంచీ ఒక వర్గం మేధావులు మానవజాతి ఏకత్వాన్నీ, సర్వమానవ సమానత్వాన్నీ ప్రచారం చేస్తూనే ఉన్నారు. అయితే వాళ్ళ బోధనలు ప్రజలవరకు వెళ్ళడంలేదు. ప్రభు వర్గాల వద్దనే ఆగిపోతున్నాయి. ప్రభు వర్గాలంటే రాజులు, పురోహితులు, పండితులు, వాళ్ళ బంధుమిత్రులు. ఈ వర్గం వాళ్ళు మేధావుల బోధనలను మెచ్చుకుంటారు. గౌరవిస్తారు, అవసరమనుకుంటే గొప్పగా సన్మానిస్తారు. అంతే, ఆ బోధనలలోని ప్రవచనాలను మాత్రం అమలు జరగనివ్వరు.

ప్రవచనాలు సర్వమానవ శ్రేయస్సును బోధిస్తాయి. ప్రభువుల ప్రవర్తన సొంత శ్రేయస్సునే చూసుకొంటుంది.

భుజ బలమూ, బుద్ధి బలమూ కలిసి ప్రభు వర్గం అవుతుంది. తన బలాధిక్యంతో ఈ వర్గం బలహీనుల్ని జయించి, వాళ్ళ శ్రమ ఫలితంలో అధికభాగాన్ని గుంజుకొంటుంది. కష్టపడకుండా సుఖంగా బ్రతుకుతుంది. అట్టి సుఖాన్ని అది ఎలా వదులుకొంటుంది ? తన నౌకరుతో, పనివాడితో "మనిద్దరం ఒక్కటే" అని ఎందుకంటుంది ? ఒక వేళ అన్నా, ఆ సూక్తిని ఎందుకు అమలు జరుపుతుంది?

మానవుల మధ్య జాతి, కుల, వర్గ నిమ్నోన్నతాలన్నీ బలాబలాల తేడాలవల్ల పుట్టినవే. బలాబలాల తేడాలు ప్రాకృతమైనట్టివి. అవి జీవజాతులన్నిటిలోను వున్నై. నిమ్నోన్నతాల పేరు మాత్రం ఒక్క మానవ జాతిలోనే వుంది. పీడించడం దుర్లక్షణం. దానిని తొలగించుకోవాలనేదే మేథావుల ఉద్బోధ. వారి ప్రబోధాలకు మెప్పే కాని, ఉప్పు అందడం లేదు.

ఫలితార్థం ఏమిటంటే - అజ్ఞానాన్ని తొలగించడానికి కూడ హరిజనులే పూనుకోవలసివుంది. అందుకు సాంస్కృతికంగా చైతన్య వంతులు కావలసివుంది. అందుకు తమ సనాతన వారసత్వాన్ని పునరుద్ధరించుకొంటే చాలు.

లోకంలో నీతులు, నీతి బోధకులు, ప్రవక్తలు, ప్రవచనాలు తక్కువేం కాదు. అయితే, అమలు జరుగుతున్న నీతులు, ప్రవచనాలు ఎన్ని? ఒక్కటీలేదు. ఎందుకని ?

"హతోవా ప్రాప్యసి స్వర్గం
జిత్వావా భోక్ష్యసే మహీం
తస్మాత్ ఉత్తిష్ఠ కౌంతేయ
యుద్ధాయ కృత నిశ్చయః"

అంటూ కర్తవ్య బోధ చేస్తున్న గీతలో అహింసా సిద్ధాంతం ఎక్క డుంది? బలవంతుడైన శత్రువుకు దాస్యం చేస్తూ బ్రతకవచ్చుననే నిష్పౌరుష ధోరణి ఎక్కడిది? "సువీరా వీరైః" అనే వైదిక పురుష నినాదం ఏమై పోయింది ?

భారతీయ వైదిక సామాజిక పద్ధతి హిందూమతంగా ఎందుకు, ఎప్పుడు మారింది ? అన్ని రంగాలలోను, ప్రపంచంలోని అన్ని జాతులకు మార్గదర్శకంగా భాసించిన భారతీయత ఆ ఉజ్జ్వల నాయకత్వ స్థానం నుంచి దళితమై పోవడానికి హేతు వేమిటి ?

ఐతిహాసిక యుగాన్ని అలా వదిలేసి, చారిత్రక యుగాన్ని మాత్రమే

పరిగణనలోకి తీసుకొన్నప్పటికీ – ఇటీవలి కాలంలో ఎంతో మంది మేధావులు జాతి పునరుజ్జీవనానికి ఎన్నో సంస్కరణలను సూచించారు కదా ? అవన్నీ ఎందుకు ఉపేక్షింపబడుతున్నాయి ?

భారతీయ జీవిత విధానాన్ని శాసించే ప్రాచీన సాహిత్యం నిండా స్వార్థపరులు తమ స్వప్రయోజనాలను ప్రక్షిప్తం చేశారన్న విషయం అందరూ అంగీకరిస్తున్నదే. స్మృతులు ధర్మశాస్త్రాలు కావు. తాత్కాలిక సాంఘిక శాసనాలు మాత్రమే. అందులో కాలదోషం పట్టినట్టివి చాలా వున్నై. వాటిని రద్దు చెయ్యవలసిన అవసరం లేదా ? మేధావులు చెప్పినా ప్రభు వర్గం వినిపించుకోదేం ?

ఈ విషయంలో జీవచ్ఛవాలై జాతి ఆరోగ్యాన్ని చెడగొడుతున్న స్మృతుల శాసనాలను రద్దు చేసి పారెయ్యాలని, జాతి సమైక్యానికి అనుగుణమైన చట్టాలను సృష్టించుకోవాలనీ వేమన, వీరబ్రహ్మం, గురజాడ, మంగిపూడి, త్రిపురనేని, తాపీ వంటి తెలుగు మేధావులే వేనోళ్ళ చాటి చెప్పారు కదా ? ఫలితమేమిటి ?

కాలజ్ఞులు, సమగ్ర జాతీయవాదులూ అయిన మేధావుల హితబోధలు బుగ్గిపాలు కావడం, స్వప్రయోజకులైన ప్రభు వర్గాల దోపిడీ వ్యూహాలే ప్రజలకు ఆమోద యోగ్యాలు కావడం చూస్తున్న కొలదీ – జాతికి దాపురించిన అభారతీయ దుస్థితి తేలికగా పోయేది కాదనీ, దాని వేళ్ళు చాల లోతుగా పాతుకుపోయి వున్నాయనీ స్పష్టపడింది నాకు. అవెంత లోతుల్లో వున్నాయో చూడాలన్న కుతూహలమే నన్ను వేద పురాణాలలోకి తీసుకుపోయింది. అప్పటి నుంచీ నేను అక్కడే స్థిరపడిపోయాను – ఆయా కాలాలలో, ఆయా పురాణ పాత్రలతో కలసి మెలిసి సంచరిస్తూ !

పురాణ పురుషుల వర్గంలోకి నా పేరు వస్తుందని నేననుకోడానికి కారణం ఇది. నేను నిరంతరం జీవిస్తున్నది వాళ్ళ మధ్యనే, ముఖ్యంగా నా పూర్వీకులైన వ్యాస వాల్మీకులతో !

ఆ విధంగా నేను వేద పురాణ కావ్యయుగాలన్నిటా, ఆయా ఋష్యాశ్రమాలలో

కాలం గడుపుతూ, నేను సేకరించిన కొన్ని వాస్తవాలను లోకానికి వెల్లడిస్తూ వస్తున్నాను నా సాహిత్యం ద్వారా.

ఆ కాలపు మహనీయుల నుంచి, ఈ కాలపు దృష్టితో హరి జనులుగా, గిరిజనులుగా పేర్కొన బడుతున్న కొందరిని ఎంచుకొన్నాను ఈ రచనకోసం.

పురాణాలలోని కథలూ, గాథలూ అప్పటి స్థితి గతులూ ఎప్పుడు వ్రాయబడ్డాయి ? స్మృతులు పుట్టిన తర్వాతనే, అస్పృశ్యతా, కుల వ్యవస్థా ఉనికి లోకి వచ్చిన తర్వాతనే అవన్నీ కల్పించబడ్డాయని నా వుద్దేశ్యం.

వేదాలలోని బ్రాహ్మలు జ్ఞాన బ్రాహ్మలు, బ్రహ్మజ్ఞాని అయిన ప్రతివాడూ బ్రాహ్మడే ఆ కాలంలో. పుట్టుకతో నిమిత్తంలేదు. పురాణాలలోని బ్రాహ్మలు జన్మ బ్రాహ్మలు. వీళ్ళకు జ్ఞానంతో నిమిత్తం లేదు.

అలానే - వేదాలలోని దస్యులూ, పురాణాలలోని శూద్రులూ ఒకటి కాదు.

ఇప్పుడు ఇక్కడ నేనొక హరిజనుణ్ణి. లక్షల సంవత్సరాల క్రితం ఆదియుగంలో నా పూర్వీకుడెవడు ? ఎవడో ఒకడు వుండాలిగా ? అతడెవరో నేను గుర్తించాను. అతడే ధర్మవ్యాధుడు. సకల ధర్మాలూ తెలిసిన కిరాతుడు. బోయవాడుగా చెప్పబడినవాడు.

అంతటి ప్రాచీనకాలపు ధర్మాసనంపై నుంచి చూసి, నా వంశం వాళ్ళెవరో వెతికి, తెచ్చి లోకానికి చూపుతున్నాను - కొన్ని నిమిషాల పాటు. ఈ వృత్తాంతాలన్నీ సాహిత్యంలో ఎక్కడెక్కడో వున్నట్టివే. క్లుప్తంగా మాత్రమే చెపుతున్నాను నేనిక్కడ.

కృతయుగంలో ధర్మవ్యాధుడు బోయ

త్రేతాయుగంలో వాల్మీకి బోయ

ద్వాపరయుగంలో వ్యాసుడు బోయ

కలియుగంలో భీమన్న బోయ

# మతంగుడు

బ్రహ్మణః క్షత్రియో వైశ్యః
త్రయోవర్ణా ద్విజాతియః
చతుర్ణ ఏక జాతిస్తుశూద్రో
నాస్తితు పంచమః.

"బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య - ఈ మూడు వర్ణాలు ద్విజులు . శూద్రులంతా ఒకే వర్ణం, పంచమ వర్ణ మనేది లేదు" అంటాడు మనువు.

మరి, ఈనాడు పంచములుగా చెప్ప బడుతున్న కోట్లాది జనమంతా ఎవరు ?

ఈ ప్రశ్నకు నేనిప్పుడు జవాబు చెప్పబోవడంలేదు. నేను చెప్పదలచింది మతంగుడి గురించి.

గుణాలనుబట్టీ, చేసే పనులను బట్టీ వైదికార్యులు సహజంగానే నాలుగు వర్ణాలుగా ఏర్పడ్డారు. అంతవరకు బాగానే వుంది. అయితే, ఈ గుణ వృత్తుల వర్ణాలు జన్మకులాలుగా మార్చబడి, వాటి మధ్య ఎక్కువ తక్కువలు కల్పించబడి, పరస్పర సంబంధాలు నిషేధించబడడంతో ఏ కులానికా కులమే ఒక ప్రత్యేక జాతిగా తయారై, ఏక జాతీయతా భావం నశించిపోయింది.

పరస్పరాకర్షణతో కూడిన స్త్రీ పురుష సంబంధాలకు కుల సంకెళ్ళు వేస్తే, అవెంత ఉక్కు సంకెళ్లైనా, చితికిపోక మానవు. క్రూరంగా, అమానుషంగా

వేద పురాణాదులలో సవరణలు చొప్పించడం ద్వారా కూడ కుల వ్యవస్థను బిగించే కొలదీ కుల సాంకర్యాలు ఏర్పడ్డాయి. సంకరార్యుల జనాభా పెరగసాగింది.

ఈ దశలోనే కుల వ్యవస్థను రద్దు చేసి ఉండవలసింది. అలా చెయ్యకుండా, సంకర సంతానాన్ని ప్రత్యేక కులాలుగా విభజించారు స్మృతికర్తలు. ఆ విధంగా శూద్రుడికి వైశ్య స్త్రీ ద్వారా పుట్టిన వాణ్ణి అయోగవు డన్నారు. క్షత్రియ స్త్రీ ద్వారా పుట్టినవాణ్ణి క్షత్త అన్నారు. బ్రాహ్మణ స్త్రీ ద్వారా పుట్టినవాణ్ణి చండాలు డన్నారు. అలానే క్షత్రియుడికొక మూడు, బ్రాహ్మడి కొక మూడు - మొత్తం తొమ్మిది సంకర కులాలు ఏర్పడ్డాయి.

అందులో ఎనిమిది కులాలు ఏమై పోయాయో తెలియదు. బహుశా తల్లి కులంలోనో, తండ్రి కులం లోనో చేరిపోయి వుంటాయి. లేక , అష్టాదశ వర్ణాలు అవేనేమో ! ఏది ఏమైనా, ఈ సంకర సంతానంలో వర్ణ బాహ్యుడుగా చేయబడ్డవాడు చండాలు డొక్కడే.

ఆ చండాలుడి వంశం వాళ్ళే పంచము లయ్యారంటాడు మంగి పూడి వెంకటశర్మ. తన నిరుద్ధ భారతంలో.

"చండాలస్తు జనితో బ్రాహ్మణ్యాం వృషలే నయః" అనేది చండాల శబ్దానికి అమరకోశంలోని అర్థం.

ఆ విధంగా చండాలుడు, వర్ణ బాహ్యుడు, అవర్ణుడు, అస్పృశ్యుడు అయిన మొదటివాడు మతంగుడు.

మతంగుడు బ్రాహ్మణ బాలుడు. చిన్నప్పుడే వేద వేదాంగ విద్యలన్నీ అభ్యసించినవాడు. పక్షుల, జంతువుల భాషలన్నీ పట్టుబడ్డవాడు. ఈ అతీత విజ్ఞానమే అతడి కొంప ముంచింది.

అతడు బాలుడుగా వున్నప్పుడు, ఒకనాడు ఒక గాడిద పిల్ల పైకి రాయి విసరడం, అది పోయి దాని తల్లితో మొరపెట్టుకోవడం, "వాడు సంకరుడే, అందుకే వాడికా చండ (తీక్షణ) స్వభావం" అని ఆ గార్ధభ మాత అనడం, అది

మతంగుడికి అర్థమై తన తల్లి దండ్రులను ప్రశ్నించడం, ఫలితంగా ఇంటి నుంచి వెళ్ళగొట్టబడడం జరిగింది. తన దోషం ఏదీ లేకుండానే అంతటి క్రూరమైన శిక్షకు తాను గురికావడం మతంగుడికి చాల ఆగ్రహం తెప్పించింది.

తన బ్రాహ్మణత్వాన్ని తిరిగి పొందడానికి అనాటి నుంచీ మతంగుడు సాగించిన వాగ్వాదాలు, పోరాటాలు, తపస్సులు ఇన్నీ అన్నీ కావు. అయితే, అప్పటికే మానవత మెడకు ఉరిత్రాళ్ళులా తయారైన సాంఘిక శాసనాలు అతడికి కించిత్తు కూడ న్యాయం చేకూర్చలేక పోయాయి.

మతంగుడి తపస్సు ధాటికి తట్టుకోలేక దేవేంద్రుడే త్రివిష్టపం (నేటి టిబెట్టు) నుంచి దిగివచ్చి, బ్రాహ్మణత్వం తప్ప ఏ వరమైనా సరే ఇస్తాననడం, మతంగుడు బ్రాహ్మణత్వాన్ని మాత్రమే కోరడం చాలసార్లు జరిగింది. అయితే, తన శాసనాన్ని సడలించడానికి రాజు ఒప్పు కోలేదు. తన పోరాటాన్ని వదులు కోడానికి మతంగుడూ ఇష్టపడ లేదు.

"చండాలోస్తు, సతు ద్విజోస్తు" - చండాలుడైనా, సద్విజుడైనా బ్రహ్మజ్ఞానం కలవాడే బ్రాహ్మణుడు అనే సత్యం గుర్తించబడడం వల్ల - చివరకు మతంగుడే విజయం సాధించాడనుకోవచ్చు. అయితే, అప్పటికే కులతత్వ వాదుల పదవీ రాజకీయాలు ప్రాబల్యం లోకి రావడం వల్ల మతంగుడి విజయం అమలు జరగలేదు.

శూద్రుడు తపస్సు చెయ్య కూడదనే నిషేధం కారణంగా శంబూకుడు వధించబడ్డ కాలమది. మరి మతంగ, ధర్మవ్యాధ, వాల్మీకి, ప్రభృతు లందరూ మహా తపస్వు లెలా కాగలిగారు ? ఈ ప్రశ్నకు ఒకటే సమాధానం. శంబూకుడు వర్ణ వ్యవస్థలోని శూద్రుడు. మతాంగాదులు వర్ణ వ్యవస్థకు వెలుపలి వాళ్ళు, స్వతంత్రులు.

ఈ మతంగుడు తనకు అన్యాయంగా సంక్రమించిన అస్పృశ్యతను తొలగించుకోడానికి, బ్రాహ్మణత్వాన్ని తిరిగి పొందడానికి పోరాటాలు జరుపుకొంటూ, అసేతు హిమాచల దేశమంతా సంచరించాడు. ఈయన సంతతివాళ్ళు దేశమంతా నిండి వుండడానికి అదే కారణం.

*చండ దేవుడన ప్రశస్తి వహించి, సు*
*స్త్రీలు పూజనంబు సేయ, కామ*
*రూప ధారివై, నిరూపింప విహగ భా*
*వంబు గల్గి, ప్రమదవర్తి వగుము !*

(భార. అను. అ 1, వ 101.)

ఇంద్రుడు మతంగుడి కిచ్చిన వరమది. దీని ద్వారా ఆయనకు కామరూపమూ, ఆకాశ గమన శక్తి కలిగాయి. సుస్త్రీల సేవ లభించింది. చండదేవుడనే పేరుతో విశ్వ విహారం చేశాడు.

అలాంటి మతంగుడు రామాయణ కాలం నాటికి కిష్కింధలోని ఋష్యమూక పర్వతం మీద స్థిరపడ్డాడు. అదే నేడు ప్రకాశం జిల్లాలోని మాలకొండ, మాలాద్రిగా పిలువబడుతున్న ప్రాంతం కావచ్చు.

ఈయన గురించిన వివరాలు రామాయణ మహాభారతాల నిండా వున్నై, వెతికితే దొరుకుతై.

ఈ మతంగుడి సంతానమే మాతంగులు - మాల మాదిగలు. "మతంగాత్ జాతాః మాతంగాః."

మతంగుడు తన నిరంతర తపస్సు ద్వారా సాధించిన విద్యలలో సంగీతం ఒకటి. ఆయన నిర్మించిన ఒక రకం వీణకు చాండాలిక అనిపేరు.

ఈయన వద్ద సంగీతం నేర్చుకోవడం కోసం జగన్మాతే ఈయనకు కుమార్తెగా అవతరించిందంటే, సంగీతంలో ఈయన ఎంత ప్రతిభ కలవాడో ఊహించవచ్చు. "జయ మాతంగ తనయే", "జయ సంగీత రసికే", జయ మాతంగి, చాండాలి", మాతంగ కన్యాం మనసా స్మరామి" అంటూ మనం నిత్యం స్మరించుకొంటున్న శాంకరి ఆనందంగా ఉపలాలించే మాణిక్యవీణ. ఈ మతంగముని నిర్మించిన చాండాలికే అయి ఉండవచ్చు !

ధర్మవ్యాధుడు తొలి హరిజనుడైనట్టే, మతంగుడు తొలి అస్పృశ్యుడు. ఈ ఇద్దరూ వియ్యంకులు. అది మరొక కథ.

# ధర్మవ్యాధుడు

"సలిలము లుర్వి ఆకసము
సర్వము జంతు మయంబు కావునన్
కలుగు నవశ్యమున్ సకల
కర్మల యందున హింస ; హింసకున్
తొలగిన దేహ యాత్ర కదు
దుర్ఘటమైనటులుండు ; ఇంతయున్
దలపరు, హింస చేయమని
తాము తలంతురు కొందరిమ్మహిన్

అంటాడు ధర్మవ్యాధుడు - ధర్మసూక్ష్మాలు తెలుసుకోవడం కోసం తన వద్దకు వచ్చిన కౌశికుడితో.

కౌశికుడు ఒక బ్రాహ్మణ యువకుడు. తల్లిదండ్రుల్ని వదిలేసి తపస్సు చేసుకొంటున్నవాడు. చెట్టుపైనుంచి తనపై రెట్ట వేసిన ఒక కొంగ తన కోప దృష్టికి భస్మమైపోగా చూసి, తన శక్తికి గర్వపడినవాడు. భిక్ష కోసం ఒక ఇంటికి వెళ్ళి, పతివ్రత అయిన ఆ ఇంటి ఇల్లాలిచే బోధితుడై, ధర్మవ్యాధుడి వద్దకుపోయినవాడు. అతడి మాంస విక్రయశాలను చూసి అసహ్యించు కొన్నవాడు. ఆయన దివ్యదృష్టికి, బ్రహ్మజ్ఞానానికి ఆశ్చర్యపడి, సాష్టాంగపడినవాడు.

"నీవు కడు ధర్మవిదుడవు, జీవహింస
జీవనమ్ముగ నడచుట శిష్టపథమె ? "

అని తనను ప్రశ్నించిన కౌశికుడికి "హింస చేయనివాడు లేడిజ్జగమున

ఒక్కడైనను” అని సమాధానం చెపుతాడు ధర్మవ్యాధుడు.

రంతి దేవుడనే రాజు రోజుకు రెండు వేల గోవుల చొప్పున వధిస్తూ, వెయ్యి సంవత్సరాలపాటు యజ్ఞ కర్మను నిర్వహించిన ఉదంతాన్ని జ్ఞాపకం చేస్తాడు. కర్తవ్య నిర్వహణలోను, వృత్తి ధర్మంలోను హింసా హింసల ప్రసక్తి లేదంటాడు.

నాలుగు వర్ణాలవాళ్ళూ నాలుగు ప్రధాన వృత్తుల్నీ సొంతం చేసుకొన్నారు కదా ? ఇక తనకు మిగిలిందేమిటి ? తాను వర్ణ వ్యవస్థకు వెలుపలివాడు - అనర్హుడు - తనకు మిగిలిన వృత్తి వేటే అంటాడాయన.

**మును తను చేసిన కర్మం**

**బున సూవె నశించు భూతములు, చంపెడు వా**

**డు నిమిత్తమాత్రు డంతియె**

**అని చెప్పగ వినమె అంచితాచార్యులచే ?**

అని, హింసాహింసల స్వభావాన్ని వివరిస్తాడు.

వన్య జంతువుల్ని వేటాడి, యజ్ఞార్పణ చేసి, దానధర్మాలు నిర్వహించి, మిగిలిన మాంసాన్ని అమ్మి జీవించే తాను కేవలం పితృసేవానిరతి వల్లనే జ్ఞానినైనా నంటాడు ధర్మవ్యాధుడు.

బ్రహ్మజ్ఞానం నేర్చుకొంటే వచ్చేదికాదు. మనస్సును ఏకాగ్రం చెయ్యటం ద్వారానే అది సిద్ధిస్తుంది. క్రోధ లోభ మోహాలను జయించి, నిర్మలమైన మనస్సును కర్తవ్య ధర్మంపై నిల్పి, ఏతద్ధర్మాచరణను ఏకాగ్రతతో త్రిశుద్ధిగా నిర్వహించాలి. అదే తపస్సు - అది జీవబ్రహ్మైక్యంగా పర్యవసించినప్పుడు పరమ విజ్ఞానమంతా కరతలా మలకమవుతుంది. అందుకు ప్రత్యక్ష నిదర్శనం ధర్మవ్యాధుడు.

వేదకాలంలోని ఋషులంతా, జన్మ కర్మలతో నిమిత్తం లేకుండా, అలా బ్రహ్మజ్ఞానులైనవాళ్ళే, విజ్ఞానధనులైనవాళ్లే.

ధర్మవ్యాధుడికి తెలియని విద్యంటూ ఏదీ వున్నట్టు లేదు - సాంఖ్యిక, శారీరక, జీవ, యోగ, ఆధ్యాత్మిక శాస్త్రాలన్నీ ఆయన నాలుకపై నివసిస్తాయి. ధర్మ సూక్ష్మాలు ఆయన కన్నుల్లో కాపుర ముంటాయి. ఆయన కౌశికుడికి బోధించిన

విషయ వైవిధ్యాన్ని పరిశీలనగా చూచినప్పుడు – ఈనాటి ఆధునిక శాస్త్రవిజ్ఞానాని కంతటికి కూడ తొలిద్రష్ట ధర్మవ్యాధుడే అనిపించకమానదు.

పాపవర్తనుండు బ్రాహ్మణుం డయ్యును
నిజము శూద్రుకంటె నీచతముడు,
సత్య శౌచ ధర్మశాలి శూద్రుండయ్యు
అతడు సద్ద్విజుండె అనిరి మునులు!

అంటాడాయన కుల వ్యవస్థను విశ్లేషిస్తూ.

ఎలాంటి పాపమైనా సరే పశ్చాత్తాపంతో సగమూ, ఆ తర్వాత అలాంటి పాపం చెయ్యకుండా వుండడంలో తక్కిన సగమూ పోతుందంటాడు. కరుణ, సైరణ, పరిత్యాగ శీలం, అపకారం చెయ్యని సత్యం, వీలైనంత అహింస వంటివన్నీ సన్మార్గనిశ్రేణులని చెపుతూ, "నిత్యము కర్మియు, కర్మఫల త్యాగియు నగుట లెస్స" అంటాడు అట్టివాణ్నే బ్రాహ్మణుడంటాం అంటాడు.

అట్టి బ్రాహ్మణున్ని గురించి చెపుతూ ధర్మ వ్యాధుడింకా ఇలా అంటాడు....

అరయగ జీవితంబు కడు
నస్థిర; మింత ఎరింగి ఆత్మ నె
వ్వరి దెస కీడు రోయక, ధ్రు
వంబగు మైత్రి భజించి, సత్కృపా
నిరతుడు, నిష్పరిగ్రహుడు,
నిత్య తపస్వియు, నిత్య తృప్తుడున్,
పరమ శమాన్వితుండు నగు
బ్రాహ్మణు డొందు సనాతన స్థితిన్.

సనాతనత్వమంటే ఇటువంటిదని నిరూపించి పల్కుతూ, తనకి విజ్ఞానం కలగడానికి కారణం తన పితృసేవే నంటాడు ధర్మవ్యాధుడు – తన తల్లిదండ్రుల్ని కౌశికుడు చూపుతాడు. కౌశికుడు సత్యాన్ని దర్శించి, తనకోసం బెంగపడివున్న తన తల్లిదండ్రుల సేవకోసం బైలుదేరి వెళ్ళి పోతాడు.

మహాభారతం అరణ్యపర్వం పంచమాశ్వాసంలో, ఎఱ్ఱాప్రగడచే బహు సుందరంగా వర్ణించబడ్డ ఘట్టమిది.

ధర్మవ్యాధుడు వేదయుగారంభంలోని వాడు. మిథిలానగరవాసి. వేట, మాంస విక్రయం వృత్తిగా గలవాడు. వ్యాధ, కిరాత, నిషాద, బోయ, చెంచు వంటి పేర్లతో పిలువబడే ఆటవిక జాతివాడు. జితేంద్రియుడు - సత్యవాది - ఆయనకు తల్లిదండ్రులే దైవం. వారి సేవే తపస్సు - సర్వధర్మాలు తెలిసినవాడు కనుక ధర్మవ్యాధుడనే పేరు వచ్చింది.

ఆయనకు అర్జునుడనే కుమారుడూ, అర్జునకి అనే కుమార్తె వున్నారు. అర్జునుడు మృత్యుదేవతనే గడగడలాడించిన వాడు. అర్జునకి కూడ గట్టిదే. ఆమె మతంగ మహర్షి కోడలు - మాంసాహారుల ఇంటి ఆడబిడ్డ శాకాహారుల ఇంటి కోడలైతే ఎలా ఉంటుందో వరాహపురాణంలో చక్కగా వర్ణించబడి వుంద.

రోజుకొక ప్రాణిని మాత్రమే చంపే తాను హింసకుడూ, గోధుమలు వంటి కోట్లకొలదీ ప్రాణుల్ని చంపి తినేవాళ్ళు అహింసా పరులూనా అంటూ ప్రశ్నిస్తాడు ధర్మవ్యాధుడు. ప్రకృతిలోని ప్రతి లవమూ ప్రాణవంతమేనని నిరూపించిన తొలి విజ్ఞాని ధర్మవాధుడు.

చివరగా లోహదండం అనే మహారణ్యంలో హరిని గురించి చాల ఘోరమైన తపస్సు చేశాడాయన. లక్ష్మీభర్త ప్రత్యక్షమై "ఇచ్చెద వరముల్, గొనుము వలసినవి, నీ వర్తనమునకున్ మెచ్చినాడ, ధర్మవ్యాధా ! " అన్నప్పుడు...

"నాకు, నా నందనులకు దయచేయు మాత్మవిద్యాయుక్త సకల కళావత్కవిత్వంబు" అని కోరాడు ధర్మవాధుడు ! ఎంతటి అపూర్వమైన వరం !!

"మద్వంశమున జనించిన వారి విజ్ఞానపరుల గావింపు" మని కూడా కోరా డాయన. "ఓయి, మహా కవీంద్ర ! వరములన్నియు ఇచ్చితి" అన్నాడు హరి. హరిచేత "మహా కవీంద్ర !" అని పిలిపించుకొన్న ఆదిమానవుడు కూడ ధర్మవ్యాధుడే.

అందుకే అన్నాను నేను, ధర్మవ్యాధుడే తొలి హరిజనుడు అని.

జంతువుల్ని వేటాడి, మాంసం అమ్మి జీవించే ఒక బోయవాడు అంతటి మహాత్ముడుగా ప్రకాశించిన కాలమది ! మరి, ఈ కాలం ? ఈ దళితత్వానికి కారణం ?

# అర్జునకి

తనకూ, తన నందనులకూ ఆత్మ విద్యాయుక్త సకల కళావత్ కవిత్వాన్ని హరి నుంచి వరంగా పొంది, మొట్టమొదటి హరిజనుడైన ధర్మవ్యాధుడికి కొడుకులూ, కూతుళ్ళూ చాల మందే వుండివుంటారు. అందులో పురాణ సాహిత్యాన్ని కెక్కిన వాళ్ళిద్దరు – కొడుకు అర్జునకుడూ, కూతురు అర్జునకి.

కూతురు యుక్త వయస్కురాలు కాగానే, ఆమెకు తగిన వరుడెవరో అనే అన్వేషణ ప్రారంభమయింది ధర్మవ్యాధుడి మనస్సులో. ఆమె అందాల రాశి, సుగుణాల ప్రోవు. ఆమె గుణ సౌందర్యాలను గురించి వరాహ పురాణంలో వర్ణించబడి వుంది. వాటిని చదవని వాళ్ళు అసలు చదువుకొన్నవాళ్ళే కారన్నంత రమణీయంగా వున్నదది.

ధర్మవ్యాధుడి అన్వేషణ మతంగ మహర్షి కుమారుడైన ప్రసన్నుడి వద్ద ఆగింది. అతడు సకల విద్యాసంపన్నుడు.

మతంగ మహర్షి ఆశ్రమం....

"లవంగ నారంగ పూగ పున్నాగ వకుళ కురవక ప్రియాళు రసాల ప్రముఖ సాల వికాసమాన సూన వాసనా సనాథ గంధ పవమాన నిరస్త సమస్త పాంథశ్రమంబగు" ఆశ్రమ మట !

అంతటి సహజ సుందర ప్రకృతి నడుమ "సరోవర తీరంబున, బహు శిష్య గణంబుతోడ, ఆహ్నిక క్రియా కలాపంబులు తీర్చి, వేదాంత శాస్త్ర వ్యాఖ్యాన గోష్ఠులు" నిర్వహిస్తూ ఉన్న మతంగ మహర్షిని దర్శించాడు ధర్మవ్యాధుడు. తన అభిలాషను వ్యక్తం చేశాడు.

అర్జునకీ, ప్రసన్నుడూ ఒకరి నొకరు చూచుకొని ఇష్టపడ్డారు. మతంగ ధర్మవ్యాధులు సంతోషించారు. వైభవంగా వివాహం జరిగింది.

అత్తవారింట నూతన వధువు పాటించవలసిన విధి నిషేధాలను గురించి కుమార్తెకు బోధించి, బరువెక్కిన హృదయంతో, గద్గద కంఠంతో వీడ్కోలు చెప్పాడు ధర్మవ్యాధుడు.

ధర్మవ్యాధుడు ఎంతటి వేదాంత పరమ తత్వజ్ఞుడో, అంతటి ఆర్ద్ర హృదయుడు. కుమార్తెను విడిచి వెళ్ళిపోతూ అతడు పొందిన కుందు వర్ణనాతీతం.

అత్తవారింట అర్జునకి మెలగిన తీరుతెన్నులు లోకంలోని నూత్న వధువు లందరికీ ఆదర్శప్రాయాలు - ప్రణవానందమూ, ప్రణయా నందమూ గంగా యమునలు కలిసి ప్రవహించిన వైదిక ధర్మం అది.

అలా కొంత కాలం గడిచిన తర్వాత, ఒకనాడు అర్జునకి వెక్కి వెక్కి ఏడుస్తూ వచ్చి, ఇంటి వాకిట్లో నిలబడడం చూచి, గతుక్కుమన్నాడు ధర్మవ్యాధుడు.

ఏమి జరిగింది ?

అత్తగారు పిలిచిందట. తనకు వినబడలేదు. 'ఏమే, పొగరా?' అంటూ నానా తిట్లూ తిట్టింది. 'అవునులే, జీవఘాతి కూతురికి మంచి బుద్ధులెలా వస్తాయి?' అంటూ తన తండ్రి వృత్తినే నిందించింది. ఎన్నైనా భరించగలిగిన తాను ఈ నిందను భరించలేక, ఇలా వచ్చేసింది !

కోపావేశంలో వణికాడు ధర్మవ్యాధుడు. ఎట్టెట్టా అంటూ లేచాడు. 'నేను జీవఘతి అనే వాస్తవం అంతకుముందు తెలీదా వాళ్ళకు ? వాళ్ళ అహింసకత్వం ఎలాంటిదో తెలుసుకుందాం పద' అంటూ కూతుర్ని తీసుకుని బైలుదేరాడాయన మతంగుడి ఆశ్రమానికి.

ఈ అత్తా కోడళ్ళ గొడవ మతంగుడికి తెలియదు. ధర్మవ్యాధుడికి ఎంతో సంతోషంతో స్వాగతం చెప్పాడాయన.

"కీకట గ్రామణీ వతంస ! నా యెడకు చనుదేరగా వలసె నేల ?" అంటూ, వియ్యంకుని ఆకస్మిక రాకకు హేతు వడిగాడు.

"మరేం లేదు. మీ ఇంట నిర్జీవాశనం (జీవహింసలేని భోజనం) తినాలని వచ్చాను" అన్నాడు ధర్మవ్యాధుడు, కోపాన్ని ఆపుకొని, నిజమే అనుకొన్నారు వాళ్లు.

మాధ్యాహ్నిక క్రియాకలాపాలు తీర్చుకొనేసరికి భోజనం తయా రయిందనే పిలుపు వచ్చింది.

"వంట ఏం చేశారు ?" అన్నాడు ధర్మవ్యాధుడు.

"యవలు, గోధుమలు, కందులు" అని జవాబు.

మతంగుడు శాకాహారి, నియమనిష్టలతో బ్రాహ్మణత్వం కోసం తపస్సు చేస్తున్నవాడు. ధర్మవ్యాధుడు వేట, మాంస విక్రయం వృత్తిగా గలవాడు. మాంసాహారి ఇంటి ఆడుబిడ్డ శాకాహారి ఇంటి కోడలు కావడంలో ఏర్పడిన ఇబ్బంది ఇది.

"అవేమిటో నన్ను చూడనివ్వండి" అన్నాడు ధర్మవ్యాధుడు.

ఆ ధాన్యాలను చేటలలో తెచ్చి చూపింది వియ్యంపురాలు - మతంగుడి భార్య.

వాటిని చూచిన వెంటనే ఉలిక్కిపడి, "హరి హరీ!" అంటూ లేచిపోయాడు ధర్మవ్యాధుడు.

"ఇన్ని కోట్ల జీవుల్ని ప్రతి పూటా చంపి తినే ఘాతుకుని ఇంట్లో భుజించడం మహా పాపం!" అన్నాడు.

అప్పటికి గాని జరిగిందేమిటో మతంగుడికి తెలియలేదు.

"నా కూతురు జీవ ఘాతి కూతురు. సరే. మరి నీ ఇల్లాలు ఎవరి కూతురో చెపుతావా ?" అన్నాడు మతంగుడితో. అంతటితో వియ్యపు రాలికి జ్ఞానోదయమై, కోడల్ని తిట్టినందుకు పశ్చాత్తాపపడి, క్షమార్పణ చెప్పుకొంది.

ఆ విధంగా హింసాహింసలకు సంబంధించిన ఒక అపోహను నిర్మూలించడానికి, సృష్టిలోని ప్రతి లవమూ జీవ వంతమే అని నిరూపించ డానికి తోడ్పడిన దిట్ట అర్జునకి !

# అర్జునకుడు

ధర్మవ్యాధుడి కుమారుడు అర్జునకుడు ఒక రోజున వేటకు వెళ్ళి, అడవిలో ఒక దయనీయమైన దృశ్యాన్ని చూశాడు. గౌతమి అనే ఒక బ్రాహ్మణ స్త్రీ, పాము కాటుచే మరణించిన తన కుమారుని కళేబరాన్ని ఒడిలో పెట్టుకొని రోదిస్తూ వుంది.

అర్జునకుడు సామాన్యుడు కాడు. ప్రకృతిలోని సమస్త శక్తుల్నీ శాసించగల సత్త్వ సంపన్నుడు. అన్యాయాన్నీ, అపకారాన్నీ సహించలేడు. వెంటనే ఆ సర్పాన్ని వెదికి పట్టుకొని, బ్రాహ్మణి ఎదుటకు తెచ్చి, చంపబోయాడు. అందుకు ఆమె అంగీకరించలేదు.

"ఈ పాము జంప, బ్రతుకునె
నా పుత్రుడు ? విడువు, మర్జునక !"

అని కోరిందామె. పామును చంపితే తన బిడ్డ బ్రతుకుతాడా అని ప్రశ్నించింది.

"బ్రతుకడు, కాని, మరొక బిడ్డను కాపాడవచ్చును కదా ? "

దుష్టుడు చేసిన దుష్కృత్యం సరిదిద్ద రాకపోవచ్చు. కాని, వాడు మరో దుష్కృత్యం చెయ్యకుండా ఆపవలసి ఉంది. ఒక ప్రాణం తీసిన వాడు మరెన్ని ప్రాణాలైనా తీయగలుగుతాడు. అలా జరగనివ్వరాదు.

అర్జునకుడి హేతువాదంలోని బలాన్ని గుర్తించిన సర్పం, మనుష్యభాషలో ఇలా అంది : "ఆ బాలకుడి చావుకు నేను కారణాన్ని కాదు, ఒక సాధనాన్ని మాత్రమే."

"మరి కారణం ఎవరు ?"

"మృత్యువు."

అవును. మృత్యువు యజమానురాలు. ఆమె ఆజ్ఞకు లోబడ్డ సాధనాలు చాలా ఉన్నై. ఆమె ఏ సాధనంతోనైనా, ఎవరి ప్రాణాన్నైనా తీయవచ్చు !

"సరే, మృత్యువునే చంపుతాను" అన్నాడు అర్జునకుడు, సర్పాన్ని వదిలేస్తూ.

"నేను కూడ కారణాన్ని కాదు, కాలుని చేతిలో ఒక సాధనాన్ని" అన్నది మృత్యువు, వెంటనే ప్రత్యక్షమై !

"ఎవరా కాలుడు ? "

"నేను కూడ కారణం కాదు" అంటూ సాక్షాత్కరించాడు కాలుడు.

చంపటం, హింసించటం, అపకారం చెయ్యటం వంటివి ఎవరో ఎవరికో సరదా కోసం చేసేవి కావు. వాటి వెనుక బలమైన కారణాలుంటై. కారణాలు క్రియకు ప్రతిక్రియలు. జీవి చేసే పనే క్రియ అంటే. ఒక పనిని తెలిసి చేసినా, తెలియక చేసినా ఫలితం ఒక్కటే. క్రియకు ప్రతిక్రియే కాలుడంటే. కాలమే కాలుడు. జనన మరణాలు కాలానుగుణ్యాలు.

ఒక పనిని (కర్మను) చేసినప్పుడు దాని ఫలితం మంచిదైనా, చెడ్డదైనా- క్షణాలలో కనిపించవచ్చు. చాలా కాలం పట్టవచ్చు.

జీవిని నడిపించేది, కష్ట సుఖాలను కలిగించేది దాని ప్రవర్తనే.

ఒక మహత్తరమైన సృష్టి రహస్యం ఆ విధంగా వెల్లడి కావడానికి కారణభూతమైనవాడు అర్జునకుడు, ధర్మవ్యాధుని పుత్రుడు !

ఈ గాధ భారతం, అనుశాసనిక పర్వం మొదట్లోనే వుంది. చక్కని తిక్కన గారి చిక్కని పద్యాలలో వుంది.

ఒకరి మృత్యువుకు మరొకడు కారణం కాడు, కాలేడు. పామును తొక్కితే మృత్యువు సద్యః ఫలమే. దురలవాట్లకు లోనైతే, అది ఫలించి మృత్యురూపం ధరించడానికి కాలం పడుతుంది.

ఈ సత్యాన్ని ఒక హరిజనుడు ద్వారా చెప్పించడం లోని వ్యాసుడి వుద్దేశం ఎంతటి భవిష్యజ్ఞాన సంపన్నం !

☆☆☆☆☆☆

# అరుంధతి

ముని చంద్రుండగు నవ్వశిష్టు సతియై
ముల్లోకముల్ మెచ్చు రీ
తిని వర్తించి, లసద్గుణాఢ్య అయి, పా
తివ్రత్య మాహాత్మ్యమున్
దనరారన్ వరతారయై పొలిచి, మిం
టన్ దంపతీ లోక వం
దనముల్ గాంచు అరుంధతీ సతియు చం
దా లాంగనా రత్నమే !

(నిరుద్ధ భారతం)

తన తపస్సుకు, తన కార్య కలాపాలకు తిరుగులేని సహకారం అందివ్వగల అర్ధాంగి కోసం అన్వేషించడం ప్రారంభించాడు వశిష్టుడు. అందుకు ఒక నియమం ఏర్పరుచుకున్నాడు. ఇసకను అన్నంగా వండి పెట్టగల కన్య తనకు భార్య కాగలదని ప్రకటించాడు.

ఎవరు చెయ్యగలరా పని ? ఎంతో కాలం గడిచింది. లోకమంతా తిరిగాడు. చివరకు ఒక హరిజనవాడ లోని అమ్మాయి ఆ పని చెయ్య గలిగింది. ఆమె అరుంధతి.

మరొక కథ వుంది. తనకు తగిన జంట కోసం వెతుకుతున్న వశిష్ఠుడు, ఒక రోజు మధ్యాహ్నం ఒక హరిజనవాడ గుండా పోతూ, అలసి ఒక అరుగుమీద కూర్చున్నాడు. అక్కడ ఒక కన్య ధాన్యం దంచుతున్నది. అంతలో లోపలి నుంచి

వాళ్ళమ్మ కాబోలు పిలిచింది. ఆ పిల్ల తక్షణం ఎత్తిన రోకలిని ఎత్తినట్టే ఒదిలేసి, లోనికి పరిగెత్తింది. ఆ రోకలి అలానే గాలిలో నిలబడి పోయింది. తర్వాత ఆమె వచ్చి, రోకలిని అందుకొని, దంపు సాగించింది.

అదంతా చూచిన వశిష్ఠుడు, ఆమె తల్లిదండ్రులను అడిగి, ఆమెను పెండ్లాడాడు. ఆమె అరుంధతి. ఆ తర్వాత కథ మామూలే.

పెండ్లైన వెంటనే వశిష్ఠుడు తన కమండలాన్ని భార్య చేతి కిచ్చి పట్టుకోమని చెప్పి, ఎక్కడికో వెళ్ళాడు. తిరిగి రాలేదు. ఆమె ఎదురు చూస్తూ అలానే నిలబడి పోయింది. ఏండ్లు గడిచాయి. ఆమె నిరీక్షణ తపస్సుగా మారింది. అది తీక్షణమై, లోకాలను ఉడుకెత్తించింది. బ్రహ్మాదులు దిగి వచ్చారు. వశిష్ఠుణ్ణి పట్టుకొచ్చారు. ఆమె చేతిలోని కమండలాన్ని అందుకొన్నాడు తృప్తిగా.

వశిష్ఠుడు చేసిన పని ఆమెను పరీక్షించడం కాదు. పరీక్ష పెండ్లికి ముందే అయిపోయింది. ఆమెకు పుట్టుకతో వచ్చిన ఇచ్ఛాశక్తికి క్రియాశీలతను కలిగించడమే అతడి వుద్దేశం. కత్తికి పదును పెట్టడం లాంటిదది. అందులో వశిష్ఠుడు తన వశిష్ఠత్వాన్ని పరీక్షించి చూచుకోవడం కూడ జరిగింది.

ఇంతకూ ఈ వశిష్ఠు డెవరు ?

"గణికా గర్భ సంభూతో వశిష్ఠశ్చ మహాముని;" "వేశ్యసుతుడు వశిష్ఠుడు విప్రుడయ్యె."

ఒకసారి సూర్యుడు, వరుణుడు ఊర్వశిని మోహ దృష్టితో చూడగా వశిష్ఠుడూ, అగస్త్యుడూ కవల పిల్లలుగా పుట్టారు. ఎవరి కొడు కెవరో తెలియదు. ఆ కాలం అలాంటిది. పాతివ్రత్యంతో పాటు స్వేచ్ఛా ప్రణయం కూడ సహజీవనం చేసిన దివ్య కాలమది. ఇంతకూ వశిష్ఠుడు సూర్య పుత్రుడే అనవచ్చు గుణ లక్షణాలను బట్టి.

మరొక కథ ప్రకారం అరుంధతి దేవహూతీ కర్దముల పుత్రిక. తొమ్మండుగురు అక్క చెల్లెండ్రలో ఒక్కతె. పదవ వాడుగా కపిలుడు పుట్టాడు. సాంఖ్య సిద్ధాంతకర్త

ఈ కపిలుడే. హరి అంశతో పుట్టిన హరిజనుడు. కర్ధమ ప్రజాపతి కూడా హరిజనుడే. ఆ కాలంలో హరిజన గిరిజనుల మధ్య తేడాలేదు. భారతదేశం మొత్తం మీద వాళ్ళదే. వాళ్ళే రాజులు. ప్రజాపతులు. బ్రహ్మలు.

అరుంధతిని వశిష్ఠుడు పెండ్లాడగా, ఆమె అక్క ఉదయ సంధ్యా, చెల్లెలు సాయం సంధ్యా సదా ఆమెతోనే ఉంటూ ఉండే వాళ్ళు. అరుంధతిని స్వచ్ఛమైన సూర్యకాంతిగా చూపే ఒక మనోజ్ఞరూపకల్పన ఇది.

ఈ విధంగా అరుంధతి గురించిన కథలు రక రకాలుగా ప్రచారంలోకి వచ్చాయి. కథలెలా వున్నా, ఆమె మాతంగుల ఇంటిబిడ్డ. వశిష్ఠుని భార్య. వశిష్ఠుడు రఘువంశ చక్రవర్తులకు పురోహితుడు. నిత్యాశ్రమ వాసి. తపో యోగ విద్యారంగాలలో నిరంతర పరిశోధకుడు.

విశ్వామిత్రుడు అహంకారంతో వశిష్ఠుడికి కలిగించిన కష్ట నష్టాలు చాల వున్నై. కల్మాషపాదు డనే రాజులో రాక్షస గుణాన్ని ప్రకోపింప చేసి, అతనిచే వశిష్ఠ పుత్రులందర్నీ చంపింప చేశాడాయన. వశిష్ఠుడి పట్ల విశ్వామిత్రుడికి కల వైరానికి కారణం కేవలం అసూయ మాత్రమే అనే వాస్తవం గమనార్హం.

అరుంధతీ వశిష్ఠ దంపతుల సంతానంలో శక్తి పెద్దవాడు. శక్తి భార్య అదృశ్యంతి. ఆమె అరుంధతి బంధువే - మాతంగ కన్య.

వ్యాసముని చంద్రుగన్న పరాశరుండు
మాలదానికి పుట్టి బ్రహ్మర్షియయ్యె,
వేశ్యకును పుట్టి మాలెత బెండ్లియాడి
ఆ వశిష్ఠ మహర్షి బ్రహ్మర్షి యయ్యె.

(నిరుద్ధ భారతం)

పురాణ సాహిత్యంలో మాల, మాదిగ, చండాల, మాతంగ శబ్దాలన్నీ పర్యాయ పదాలు గానే వాడబడతాయనే సంగతి మనం గుర్తించవలసి వుంది. సవర్ణుల దృష్టిలో అవర్ణులంతా ఒకే వర్గం.

శక్తి మహర్షిని రాక్షసుడు హత్య చేసే నాటికి అదృశ్యంతి గర్భవతి. ఆమె కుమారుడు పరాశరుడు. తన తండ్రిని చంపిన రాక్షస జాతినే నాశనం చెయ్యడానికి రాక్షస యాగం చేసినవాడాయన.

ఒకనాడీ పరాశరుడు యమునా నదిని దాటుతూ, పడవ నడుపుతున్న మత్స్యగంధిని చూచి మనసు పడగా, వేద వ్యాసుడు పుట్టాడు. ఆ విధంగా జగత్ప్రసిద్ధులైన భారతీయ మహర్షుల వంశానికి అరుంధతి మూలపుటమ్మ అయింది.

అరుంధతి పాతివ్రత్య మహిమకు సంబంధించిన కథలు చాలా వున్నై. భారతీయ స్త్రీత్వ స్వచ్ఛతకు, ఔచితికి, దీక్షకు ఆమె ప్రతీక. ఏ రూపమైనా ధరించగల కామరూపులు కూడ తన రూపాన్ని ధరించలేనంతటి తీక్షణ వ్యక్తిత్వం ఆమెది.

అగ్ని దేవుడి భార్య స్వాహా దేవి ఒక సందర్భంలో సప్తఋషుల భార్యల రూపాలు ధరించడానికి ప్రయత్నించి, ఆరుగురి విషయంలో కృతకృత్యురాలైంది. అరుంధతి రూపం మాత్రం ధరించలేకపోయింది. ఆ కారణం వల్లనే సప్తర్షి మండలంలో తమ భర్తలతో వుండే అర్హతను ఆ ఆర్గురూ పోగొట్టుకోవడం జరిగింది. అరుంధతి ఒక్కర్తే వశిష్ఠుడితో ఇప్పు డక్కడే వుంటున్నది. వసంత ఋతువులో, ఉత్తరాకాశంలో సూర్యాస్తమయానంతరం ఎవరైనా దర్శించవచ్చు ఆ దివ్యమూర్తిని. సాంప్రదాయక వివాహాలలో నూతన వధూవరులు దర్శించుకొనే దీమెనే. అంతటి ఉన్నతోన్నత స్థానం, ఉత్తమోత్తమ గౌరవం ప్రపంచంలో మరెవరికీ, ఏ కాలంలోనూ లభించి వుండలేదు.

వివాహానికి పూర్వం వశిష్ఠుడికి ఇసకను అన్నంగా వండి పెట్టగలిగిన అరుంధతి, ఆ తర్వాత కరువు వచ్చినప్పుడెల్లా రాళ్లను రొట్టెలుగా మార్చి మానవజాతిని కాపాడిందంటే వింత పడవలసిన దేముంది ?

వేదవ్యాసుడు అరుంధతికి ముని మనుమడు. అతడు భారత వంశకర్త. ఆ విధంగా భారతీయులంతా అరుంధతీయులే. మొత్తం భారతజాతికే అరుంధతి మాతృస్థానీయురాలు !

అరుంధతి మరొక కుమారుడు సుతవుడు. అతడి భార్య సుధేష్ణ - ఆ దంపతుల కుమారుడు బలి - అతడి కుమారుడు అంగ రాజు - అతని సంతానమే వంగుడు, కళింగుడు, ఆంధ్రుడు, పుళిందుడు, సింహకుడు వగైరా. అంటే - భారత పూర్వ దిగ్దేశ రాజ్యాల పాలకులందరూ అరుంధతి వంశీయు లన్నమాటే కదా ?

☆☆☆☆☆☆

# వాల్మీకి

భారత జాతికి సంబంధించి నంత వరకూ చరిత్ర రెండు భాగాలు. ఒకటి - వాస్తవంగా తెలిసిన చరిత్ర. రెండు - ప్రాచీన సాహిత్యం ద్వారా తెలుస్తున్న చరిత్ర - ఈ రెండో దానినే ఇతిహాసం అంటున్నాం. వేదాలు, ఉపనిషత్తులు, కావ్య పురాణాలు ఇతిహాసం క్రిందకి వస్తై.

భారతీయ జీవిత విధానంపై ఇతిహాస ప్రభావం అధికం. ముఖ్యంగా రామాయణ, మహాభారతాల లోని రాముడు, కృష్ణుడు వంటి పాత్రలు మనకు చారిత్రక పురుషుల కంటె కూడ వాస్తవ వ్యక్తులు - దైనందిన క్రియా కలాపాలలో మనలో కలిసి మెలిసి తిరిగే ఆత్మీయులు.

తన కాలంలోని ఒక మహావీరుడు. ఉత్తమ పురుషుడు, ఆదర్శ చక్రవర్తి అయిన అయోధ్యా రాముణ్ణి కావ్య నాయకుడుగా గ్రహించి, రామాయణ మహా కావ్యాన్ని నిర్మించిన వాడు వాల్మీకి. వేద పురాణాలకు విభిన్నమైన ఒక అపూర్వ సాహితీ ప్రక్రియను సృష్టించి, వాల్మీకి ఆ విధంగా ఆదికవి అయ్యాడు. రస జగత్తుకే స్రష్ట అయ్యాడు. తమసా నదీ తీరంలోని ఆశ్రమం వాల్మీకిది.

వేదాలు ప్రభు సమ్మితాలు, మనిషిని ఆజ్ఞాపిస్తై. ఆజ్ఞల్ని శిరసా వహించడంలో ఆత్మ వికాసం లేదు. పురాణాలు మిత్ర సమ్మితాలు. సలహాలు చెపుతై. బహుశా అందుకే, జీవితాన్ని ఆనంద సుందరంగా తీర్చి దిద్దుకోవడానికి కాంతా సమ్మితమైన కావ్యం అవసరమయిందను కోవచ్చు.

జీవితానికి ఒక అందమైన అర్థ స్ఫూర్తిని కలిగించేది కవిత్వం. కవిత్వాన్ని వివిధ పాత్రలలో అందించేది కావ్యం. కవిత్వం వేదాల నిండా ఉంది. ఋగ్వేదం ఒక కవితార్ణవమే. అయితే, ఆర్ణవంలోని రసాన్ని గ్రహించి, మేఘ రూపాన్ని సంతరించి, లోకానికి జీవామృతాన్ని వర్షించ వలసిన వసంత రవి కావ్య కవి. అట్టి కవులందరికి వాల్మీకి ఆది పీఠాధిపతి.

నిర్గుణ పరమాత్మ నుంచి వ్యక్తమైన సగుణ ప్రకృతిలో ఎన్ని రకాల గుణ ప్రవర్తన లుండ గలవో, అన్నిటికీ రూపకల్పన చేసి చూపాడాయన రామాయణ కావ్యం ద్వారా.

చిన్న వాడిలో అయినా ఉత్తమగుణముంటే, అతడు ఉత్తముడే. గొప్పవాడిలో అయినా నీచ గుణముంటే, అతడు నీచుడే, నిజానికి ఏ గుణమూ సర్వ స్వచ్ఛం కాదు. ఎంత మంచి గుణంలో అయినా, ఎక్కడో రవంత చెడు వుండకుండా వుండదు. ఆత్మ జ్ఞానంతో చెడును తొలగించు కొంటూ పోవాలి. రామాయణ పాత్ర లన్నిటా ఈ వాస్తవాన్ని ప్రదర్శించి చూపాడు వాల్మీకి. చెడును తొలగించుకోవడం ఎలాగో కూడ చూపాడు.

ఇంతటి మహాత్ముడైన వాల్మీకి ఎవరు ? అంతకు ముందులేని నూతన ప్రక్రియను ఎలా సృష్టించ గలిగాడు ?

ఋషుల మూలం, నదుల మూలం, వీరుల మూలం వెదకగూడ దంటారు. అయినా వెదకుతూనే వుంటారు. వాల్మీకిని గురించి కూడ అలానే వెతికి, ఆరాలు తీసి, పురాణాల కెక్కించారు మన పూర్వులు. అవి బహువిధాలుగా వున్నై.

కొన్ని పురాణాల ప్రకారం వాల్మీకి బ్రహ్మ పుత్రుడు. తల్లీ, తండ్రి తెలియని వాళ్ళను ఆ కాలంలో బ్రహ్మ పుత్రు లనే వాళ్ళు. అయితే, వాల్మీకి నిజంగానే బ్రహ్మపుత్రుడు, ప్రచేతన బ్రహ్మ పుత్రుడు.

స్వర్గంలో పుట్టినా, పుట్టుకతోనే ఆకలి బాధ పట్టుకొన్న దతణ్ణి. ఆకలి తీర్చలేని తండ్రి ఆగ్రహించి చండాలుడవు కమ్మని శపించగా, దళితుడైపోయా డతడు.

కోపంవస్తే "చండాలుడవు క"మ్మని శపించడం ఒక ఫేషనై పోయిన కాలమది - చండాలుడంటే తీవ్రకోపం కలవాడు. మరి, శపించేవాడి కోపం అంతకంటె తక్కువదా ? న్యాయం బలవంతుల బంటు. ఎప్పుడూ అదంతే !

దళితుడైన వాల్మీకి హరిజన వాడనుంచి అరణ్యాలకు పారిపోయి, అక్కడే ఒక గిరిజన కన్యను పెండ్లాడి కాపురం పెట్టాడు. వేటతో పాటు దారి దోపిడీ కూడ అతడి కొక వృత్తి అయింది. సంతానం పెరిగే కొలదీ.

ఒక రోజన దోచుకోడానికి సప్తర్షులు దొరికా రతడికి. వారికి అతడిపట్ల కోపానికి బదులు కారుణ్యం ఏర్పడింది.

"ఓ బోయవాడా ! నీవు చేస్తున్నది పాపం. కుటుంబ పోషణ కోసం చేస్తున్నానంటావా ? అందులో కొంత భాగమైనా నీ భార్య పంచు కొంటుందేమో, కనుక్కురా !" అన్నారు వారు.

"కుటుంబ పోషణ నీ కర్తవ్యం. దానికి సంబంధించిన పాప పుణ్యాలతో నాకు నిమిత్తం లేదు." అన్నదామె ! ఆ మాటలతో వైరాగ్యం పొడచూపిం దతడిలో.

సప్తర్షులు చెప్పిన "రా, మ" అనే రెండక్షరాలను గ్రహించి ధ్యానంలో కూర్చున్నాడతడు. అదే తపస్సుగా మారింది. అది ఫలించడానికి చాలా కాలమే పట్టింది. అప్పటి కాయన మీద ఒక పెద్ద పుట్ట కూడ పెరిగింది.

పుట్టకు సంస్కృత పదం వల్మీకం. వల్మీకం నుంచి బయటకు రావడం వల్ల వాల్మీకిగా ప్రసిద్ధి పొందాడాయన. తర్వాత నారదుడు చెప్పగా రామకథను విని, దాని నొక కావ్యంగా రూపొదించడం జరిగింది.

రామాయణాన్ని అంత సహజంగా, నవరస భరితంగా కారుణ్య ప్రధానంగా తయారు చెయ్యడంలో ఆవేశ మిచ్చిన సంఘటన ఒకటుంది. అది ఇది :

ఒక ప్రాతఃకాలం, ఒక నిషాదుడు ఆ అడవిలో, చెట్టుపై క్రీడిస్తున్న కొంగల జంట మీదకు బాణంవేసి, అందులో ఒక దానిని పడగొట్టడం వాల్మీకి చూశాడు.

ఆ పిట్టల విషాదానికి విలవిల్లాడి పోయాడు. వాటికి అట్టి శోకాన్ని కలిగించిన కిరాతుడిపై పట్టరాని ఆగ్రహం వచ్చింది. అదొక లయలో వెలువడింది.

మా నిషాద ప్రతిష్ఠాం త్వం
ఆగమ శ్శాశ్వతీః సమాః
యత్ క్రౌంచ మిధునాదేకం
అవధీః కామ మోహితం !

పక్షుల జంట శోకం, వాల్మీకి మహర్షిలో కలిగించిన శోకం, వాల్మీకి మహర్షిలో కలిగించిన శోకరసం, అలా శ్లోకంగా వెలువడిందాక్షణంలో, ఛందోబద్ధమైన తొలి పద్యం అదే, కవితా ప్రపంచంలో.

"కామ మోహితమై క్రీడిస్తున్న జంటను విడదీసిన క్రూరుడా ! ఇంతటితో నీ ప్రతిష్ఠ అంతమగు గాక !" అంటూ కిరాతుణ్ణి తిట్టిన ఆ శ్లోకంలో రావణుణ్ణి శపిస్తున్న ధ్వని ఉంది. రామాయణ మహాకావ్యానికి బీజం ఆ శ్లోకమే. జీవకారుణ్యం రసమయిందందులోనే.

లోకోత్తర గుణ సంపన్నురాలైన సీతారాములు రాజ్య పాలన చేస్తున్న కాలమది. వారిని గురించిన కథలు వివిధ ప్రాంతాలలో, వివిధ విధాలుగా ప్రచారంలో వున్నై. వాటన్నిటినీ పరిశీలించి, ఔచిత్యాన్ని పాటించి, తన కావ్య కథను అల్లుకొన్నాడు. మానవ లక్ష్యానికి జీవిత లక్షణాలను చిత్రీకరిస్తూ, దేశ కాలాతీతమైన విశ్వకావ్యాన్ని నిర్మించి ధన్యుడైనాడు వాల్మీకి.

రామ చరిత్రలో, చివరి ఘట్టంలో వాల్మీకి కూడ ఒక పాత్ర. రామ పరిత్యక్త అయిన సీతకు తన ఆశ్రమంలో ఆశ్రయ మిచ్చి, కుశలవులను పెంచి పెద్ద చేసిన మహనీయు డాయన.

కూజంతం రామ రామేతి
మధురం మధురాక్షరం
ఆరుహ్య కవితా శాఖాం
వందే వాల్మీకి కోకిలం

# గుహుడు

వేదాలలో ఆర్య, దేవ, దాన, దస్య, రాక్షస వంటి పేర్లు కనిపిస్తాయి. ఆర్యులంటే మంచి గుణాలు కల మానవులు. ఒక క్రమమైన సాంఘిక వ్యవస్థను ఏర్పరచుకొన్న వాళ్ళు.

ఇంద్ర, వరుణ, వాయు, అగ్ని వంటి దేవతలు ప్రకృతి శక్తుల రూప కల్పనలు. ఈ అన్నీ కలిసిన సమైక్య శక్తినే ఈశ్వరుడు (ఏకం సత్) అన్నారు.

బలహీనుల్ని దస్యులన్నారు. క్రూరుల్ని రాక్షసు లన్నారు.

వేద కాలంలోని వర్ణ వ్యవస్థకు, ఈనాటి కుల వ్యవస్థకు సంబంధం లేదు. వర్ణ వ్యవస్థ శ్రమ విభజన తోడిది. గుణాలు ప్రాతిపదికగా శాంతి కాములైన మానవులంతా ఆర్య సామాజిక వ్యవస్థలో చేర్చుకోబడ్డ కాలమది. ఆ కాలాన్ని గుర్తించాలంటే ఈ వాస్తవాలను గుర్తించాలి.

ఆర్యులంటే కర్షకులు. కర్షకులే తొలి నాగరికులు – వ్యవసాయం వృత్తిగా స్థిరపడినవాళ్ళు. సుఖ శాంతులతో బ్రతకడం అలవాటైన వాళ్ళు. అట్టి వాళ్ళు తమపై దాడులు జరిపే అనాగరిక దుష్ట శత్రుమూకల నుంచి ఆత్మ రక్షణ చేసుకోవలసి లేదా? అలా చేసుకోలేని జాతి నశించి పోవడమో, దాసీది కావడమో జరగదా ?

అందుకే ఏ చారిత్రక సంఘటనలనైనా ఆనాటి పరిస్థితుల దృష్ట్యా పరిశీలించవలసి వున్నదనడం.

ఎవరు ఆర్యులు ? ఎవరు దస్యులు ? ఎవరు రాక్షసులు ? ఇవి జాతులు కావు, గుణాలు. సత్యం వీరం దుష్ట క్రూర గుణాలపై విజయం సాధించుకొంటూ వస్తున్న ఒక నిరంతర యుద్ధ చరిత్ర మానవ చరిత్ర.

గుహుడు ఆర్య వ్యవస్థలోని వాడు కాదు. నిషాదుడు. ఆటవికుడు. గిరిజనుడు. గంగా తీరంలోని గిరిజనులకు రాజు. దశరథుడికి మిత్రుడు. రాముడి పట్ల పితృవాత్సల్యం కలవాడు.

గంగా తీరంలోని శృంగవీర పురం రాజధానిగా, ఆ ప్రాంతాన్ని పరిపాలిస్తున్న గుహుడు గొప్ప బలవంతుడు. సైనిక బలం, రాజనీతి, ప్రజా రంజకత్వం ఆయన సొత్తు.

మానవుడు విద్యా విజ్ఞానాల ద్వారా నాగరికుడవుతూ వుండడం వల్ల, ఆటవికులు, నాగరికులను తమకంటె ఉన్నతులుగా పరిగణిస్తూ, గౌరవిస్తూ వుంటారెప్పుడూ. అదే పూజ్య భావం అయోధ్య పట్ల గుహుడి కుంది. అయోధ్యకు శృంగవీరం సరిహద్దు రాజ్యం. మిత్ర రాజ్యం. దక్షిణం నుంచి ఏ విధమైన భయమూ లేకుండా అయోధ్యకు రక్షణ కల్పిస్తున్నట్టిది. నదీ సంపద, అటవీ సంపద పుష్కలంగా కలిగి వున్నట్టిది.

శ్రమ విభజన ద్వారా నాగరికులలో ఏర్పడిన సాంఘిక వ్యత్యాసాలు అటవికులలో లేవు, సహజ సంపదలతో, సుఖ సంతోషాలతో అందరూ, ఒకరి కొకరు అడ్డం కాకుండా సహజీవనం చేసే సమతా వ్యవస్థ అది. దానికి ఉత్తమ గుణశక్తులు గల గుహుడు రాజు.

శ్రీరాముడు యువకుడు. విశ్వామిత్రుడి దర్శకత్వంలో ఆయన చేసిన అద్భుతాలు ప్రచారమై వున్నై. అట్టి శ్రీరాముడు పితృవాక్య పరిపాలన దీక్షతో అరణ్య వాసానికి పోతూ సతీ సోదర సహితుడై తన రాజ్యంలోకి వచ్చాడంటే ఎంతో సంభ్రమం పొందాడు గుహుడు. మంత్రుల తోను, బంధుమిత్రుల తోను వెళ్ళి స్వాగతం చెప్పాడు. అనేక విధాలైన భక్ష్య, లేహ్య పేయాలను సమర్పించాడు. మృదుశయ్యలు, అశ్వగ్రాసం వంటి ఎన్నో అవసరాలను తెచ్చి స్వీకరించ మన్నాడు.

"మహా బాహూ ! శ్రీరామా ! నా అధికారం క్రింద వుండే ఈ నేలంతా అరణ్యమే. ఇక్కడ వుండి ఈ రాజ్యాన్ని పాలించుకో ! ఇదంతా నీదే. మేమంతా నీ వాళ్ళమే. అరణ్యవాసం కోసం ఇంకా దక్షిణ కీకారణ్యాల లోకి వెళ్ళనక్కరలేదు." అని అర్థించాడు.

గుహుణ్ణి చూచి ఎంతో ఆనందపడ్డాడు శ్రీరాముడు.

"మిత్రమా, గుహుడా ! నీ స్నేహమే నాకు సత్కారం. దీక్షలో వున్న నాకు ఈ కానుకలతో అవసరమేముంది ? వాటన్నిటినీ తిరిగి నీకే ఇచ్చివేస్తున్నాను. గుర్రాలకు మేత అవసరం కనుక దానిని స్వీకరిస్తున్నాను" అన్నాడు.

లక్ష్మణుడిచ్చిన మంచినీళ్ళు మాత్రం తాగి, శ్రీరాముడు నేలపై ఒక తుంగ చాప పరుచుకొని మేను వాల్చగా, దూరంగా ఒక చెట్టుక్రిందకు పోయి కూర్చున్న లక్ష్మణుణ్ణి కోరాడు గుహుడు – "భోజనం చేసి, తాను తెచ్చిన పరుపుల నుపయోగించుకో వలసింది"గా.

"అన్న నేలమీద పండుకోగా, నేను పరుపు మీద పడుకొంటానా?" అన్నాడు లక్ష్మణుడు. ఆయన అలా అంటాడని గుహుడుకి తెలియదా ! మర్యాద. అంతే.

ఆ మరునాడు సీతా రామలక్ష్మణులు గుహుడికి, తదితరులకు వీడ్కోలు చెప్పి, గంగ దాటి వెళ్ళారు.

వెళ్ళేముందు, రాజ్య రక్షణకు తీసుకోవలసిన చర్యలను గురించి గుహుణ్ణి హెచ్చరించాడు శ్రీరాముడు. సేన, కోశాగారం, కోట, రాజ్యం వీటి విషయంలో అలసత్వం వద్దన్నాడు. ఎందుకంటే, కోసలరాజ్య సుఖ శాంతులు కొంతవరకు గుహుడి శక్తి సామర్థ్యాలపై ఆధారపడివున్నాయి. భవిష్యత్తులో కూడ గుహుడి స్నేహం తనకు చాల అవసరమైవుంది.

ఆ తర్వాత కొద్ది కాలంలోనే భరతుడు చతురంగ బలాలతో వచ్చి గంగాతీరం చేరుకోవడంతో, ఆయన ఆంతర్యం తెలియని గుహుడు తాను కొంత సన్నద్ధుడు

కావలసి వచ్చింది. భరతుడు శ్రీరాముడి మీద యుద్ధానికే బయలుదేరాడేమో ! అప్పుడు తాను భరతుణ్ణి ఎదిరించక తప్పదు.

గుహుడు ఎంతటి విశ్వసనీయ మిత్రుడో అంతటి రాజనీతి చతురుడుగా ఈ ఘట్టం స్పష్ట పరుస్తుంది.

ఒక ప్రక్క సర్వసేనా సన్నద్ధుడై వున్న గుహుడు నమ్రతతో భరతుణ్ణి సమీపించి, ఆ రాత్రికి అక్కడ ఆగి తమ ఆతిథ్యం స్వీకరించవలసిందిగా కోరాడు - వాంఛితార్థాలన్నిటి తోనూ సత్కరిస్తామన్నాడు.

భరతుడు తానెందుకు వచ్చిందీ వివరిస్తూ, తనను అనుమానించ వద్దని గుహుణ్ణి కోరాడు. గుహుడు సంతోషించి, అయాచితంగా లభించిన రాజ్యాన్ని వదులు కొంటున్న అతడి త్యాగశీలతను ప్రశంసిస్తూ, "ధన్యస్త్వం, నత్వయా కుల్యం పశ్యామి జగతీ తలే" అంటూ కొనియాడాడు.

రావణ వధానంతరం అయోధ్యకు తిరిగి వెళ్ళే ముందు, అక్కడి పరిస్థితు లెలా ఉన్నాయో తెలిసికొనేందుకు శ్రీరాముడు హనుమను పంపించాడు. ఆ సందర్భంలో చెప్పవలసిన మాటలు హనుమకు చెపుతూ, శృంగ వీర పురం వెళ్ళి తన యోగ క్షేమాలను నిషాదరాజైన గుహుడికి తెలియజేయ వలసిందిగా హనుమను కోరాడాయన.

గుహుడు శ్రీరాముడికి ఎంత ప్రాణమిత్రుడో ఈ ఉదంతం ధ్రువపరుస్తున్నది. గుహుడు ఒక గొప్ప రాజు. కోసల రాజ్యం కంటే బహు విశాలమైన రాజ్యానికి రాజు. పడవను నడిపే మమూలు వ్యక్తికాదు.

☆☆☆☆☆☆

# శబరి

పంపాసరోవర తీరంలో సర్వరమణీయమైన ఒక ఆశ్రమ ప్రాంగణంలోకి వచ్చి నిలబడ్డారు రామలక్ష్మణులు. అక్కడ లేళ్ళూ, పులులూ పరస్పర విశ్వాసంతో సహజీవనం చేయడం వంటి అద్భుతాలు వారి కంటబడ్డాయి.

అంతలో ఆరిపోయే ముందు భగ్గుమంటున్న దీపజ్యోతి లాంటి ఒక కృశాంగి, వృద్ధురాలు వారి వద్దకు వచ్చి ముకుళిత హస్తాలతో నిలబడింది. ఆమె శబరి.

గోదావరీ తీరంలోని భద్రాచలం వద్ద గల పర్ణశాల నుంచి సీత మాయమైన తర్వాత, దుఃఖ సంతప్తులైన రామలక్ష్మణులు సీతను వెతుక్కొంటూ వస్తున్నారు. దారిలో జటాయువు, ఆ తర్వాత కబంధుడూ వారికి సీతాపహరణను గురించిన సమాచారం కొంత అందజేశారు. వారి సూచనలను అనుసరించి, దక్షిణ దిశగా ప్రయాణిస్తూ, అప్పటి కక్కడికి వచ్చారు.

పంప ఋష్యమూక పర్వత శ్రేణులలోది. ఆ పర్వతాలలో మతంగ మహర్షి తపస్సు చేసుకొంటున్నాడు. ఆ ప్రాంతమంతా కిష్కింధా రాజ్యంలోది. ఆ రాజ్యపాలకుడైన వాలి తనకు తరచు కలిగిస్తున్న చికాకులకు కినిసిన మతంగుడు శాపం ద్వారా వాలిని నిరోధించి, ఆ పర్వతాలను తన స్వాధీనంలో వుంచుకొన్నాడు. అదంతా మరొక కథ.

బహుశా ఈ మతంగుని పేరు మీదనే ఈ పర్వత శ్రేణికి "మాలకొండ" "మాలాద్రి" అనే పేర్లు వచ్చి ఉండవచ్చు.

ఉత్తరాంధ్ర పర్వతారణ్యాలలో నివసిస్తున్న ఒక తెగ గిరిజనులను ఇప్పుడు మనం సవరులు అంటున్నాం కదా. వీరిని గురించి గిడుగు రామమూర్తి గారు చేసిన పరిశోధనలను గురించి కూడ అందరికి తెలుసు. ఆ సవర తెగకు చెందినదే శబరి. సవర శబ్దమే శబరి అయింది. శబరాలయం అంటే బోయపల్లె అని నిఘంటు వివరణ. శాబరం అనే తంత్ర విద్యకు మూల పురుషులు ఈ శబరులే.

రామలక్ష్మణుల ముందు నిలబడ్డ శబరి అలా ఎంత సేపు నిలబడిందో!

ఎవరీ సుందరమూర్తి ! ఎవరీ దివ్య విగ్రహం ! ఎవరీ పరమాత్మ! తాను ఎదురు చూస్తున్న రాముడేనా ? తన మనస్సు చిత్రించుకొన్న రూపమే ఎదుటికి వచ్చి నిలబడిందా ? మనో విలాసం కాదు, రాముడే నిజమేజ. నిజంగానే వచ్చాడు ! తన తపస్సు ఫలించింది ! ఎన్నాళ్ళుగానో ఆయన కోసం తాను సేకరించి పెడుతున్న ఫలాలకు మాధుర్యం సిద్ధించింది !

పరవశించిన శబరి పరావేశంతోనే ఆహ్వానించింది వారిని ఆశ్రమం లోకి. అక్కడ లక్ష్మణుడు కూడ వున్నా, ఆమెకు కనిపిస్తున్నవాడు రాముడొక్కడే!

తానొక శబర రాజ పుత్రిక. తల్లి దండ్రుల ముద్దు బిడ్డ. ఎన్ని విద్యలు నేర్చింది ! ఎంత గారాబంగా పెరిగింది ! తన కోసం ఎంత మంది వీర యువకులు కొట్టుకు చచ్చారు ! అదే –

అదే తనకు నచ్చలేదు. అంత మందికీ తానే ఎందుకు కావాలీ ? తనకంటె అందగత్తెలు, ఓజోవతులు, విద్యా వినయ సంపన్నలు తమ ఇరుగు పొరుగున ఎంతమంది లేరు ? అలాగే – స్త్రీలే కాదు, పురుషులే కాదు, సమస్త జీవ రాశులూ ఎవరి కోసం నిరంతరం కొట్టుకు చస్తున్నాయో, ఆ పరమానంద రసరాట్టును తానెందుకు పొందగూడదు? అలాంటివాడు ఒక రూపంలో వుంటాడా?

ఇలాంటి భావాలు, భావ ఘర్షణలు తన మనస్సులో ప్రజ్వరిల్లి, క్రమంగా పెచ్చరిల్లి, తనలోని భౌతిక వాంఛలన్నిటిని దహించి వేస్తున్న సమయంలో మహాతపస్వి మతంగుడి పరిచయం కలిగింది.

తనను కారణ జన్మగా గుర్తించాడు మతంగుడు. పరమజ్ఞానం ద్వారా ఆరాటాన్ని తొలగించాడు. తన ఊహామూర్తి విశ్వమయుడు. అతణ్ణి పొందడం ఈ శరీరంతో సాధ్యంకాదు కదా ?

శరీర త్యాగం ధర్మ విరుద్ధ మన్నాడు మతంగుడు. 'శరీరం దానంతట అదే పోతుంది. మధ్యలో బలవంతంగా దాన్ని పోగొట్టుకోగూడదు. నీ మనస్సు కల్పించుకొన్న రూపంలో నీ దేవుడు నీ వద్దకు వచ్చే అవకాశం వుంది, తపస్సు చేసుకో' అన్నాడు.

తపోదీక్ష లోనే తాను వృద్ధురాలై పోయింది. ఈ మధ్యనే శ్రీరామ రూపాన్ని వర్ణించాడు మతంగుడు. తన మనస్సు లోకి చూడగల పరమజ్ఞాని! శ్రీరాముడు వస్తున్నాడన్న శుభవార్త, రాలిపోతున్న తన శరీరాన్ని ఇంతవరకు ఆపి వుంచగలిగింది.

రామలక్ష్మణులిద్దరూ ఆశ్రమవేదిక మీద కూర్చున్నారు. తాను సేకరించిన పండ్లగంపను వారిముందు పెట్టి, పాదాల వద్ద కూర్చుంది శబరి. అప్పుడు నోరు విప్పాడు రాముడు...

*"తపో ధనే !*
*కచ్చిత్ తే నిర్జితా విఘ్నాః ?*
*కచ్చిత్ తే వర్ధతే తపః ?*
*కచ్చిత్ తే నియతః కోపః ?"*

అంటూ కుశల ప్రశ్నలు వేశాడు.

గంపలోని పండ్లన్నీ చిలుక కొట్లుగా కనిపించినై – అవి చిలుకలు తిన్నవి కాదనీ, తానే రుచి చూచి పెట్టాననీ అనినది శబరి. రుచికర మైన వాటిని ఎంపిక చెయ్యడానికి అంత కంటే మార్గం లేదన్నది.

చిరునవ్వు నవ్వాడు రాముడు – లక్ష్మణుడు ఆశ్చర్యంగా, ఆనందంగా చూస్తూ వుండగా, పండ్లన్నీ తానే ఆరగించేశాడు పిల్ల వాడిలా. శబరి తాను కౌసల్యగా మారిపోయిన పరమ స్థితి అది !

# హనుమ

ఆంజనేయుడు, హనుమంతుడు, మారుతి వంటి ఎన్నో పేర్లతో పిలువబడే హనుమను గురించి లోకంలో తెలియని వాళ్ళెవరూ వుండరు. కనుక నేనిక్కడ ఎక్కువగా చెప్పడం లేదు.

అహల్యకు వాలి, సుగ్రీవుడు పుత్రులు, అంజన పుత్రిక, తండ్రి గౌతముడిచే వదలివేయబడిన వాలి సుగ్రీవుల్ని ఋక్షవిరజుడు అనే వానరుడు రక్షించి, పెంచి, తన కిష్కింధా రాజ్యాన్ని వారి కిచ్చాడు. వాలి ఇంద్రశక్తిని, సుగ్రీవుడు సూర్యశక్తిని గ్రహించి లోక విఖ్యాతులైనారు.

అంజన భర్త కేసరి. వారి పుత్రుడే హనుమ. శివశక్తినీ, వాయు వేగాన్ని పుణికి పుచ్చుకొని పుట్టిన మహాసత్త్వశాలి హనుమ.

ఆయన అలౌకిక శక్తుల్ని గురించి చెప్పాలంటే....

పుట్టగానే ఉదయ సూర్యుణ్ణి చూచి ఏదో పండనుకొని, ఆకాశంలోకి ఎగిరి, సూర్యుణ్ణి మింగబోయి మూతి కాల్చుకొన్నాడు. ఉదయాద్రిపై ఒక కాలు, అస్తాద్రిపై ఒక కాలు ఉంచి నిలబడ్డాడు. సూర్యుణ్ణే గురువుగా వరించి ఆయనతో ఆకాశంలో సమంగా పయనిస్తూ, సకల విద్యలూ నేర్చుకొన్నాడు. ఇంతకంటె మహాద్భుతాలు మరేముంటై ? ఇలాంటివే ఎన్నో చేశాడు హనుమ.

వాలి సుగ్రీవులకు మేనల్లుడు హనుమ. అందులో సుగ్రీవుడికి బాల్య స్నేహితుడు. ఎంతటి కష్ట కాలంలో అయినా, ఆయనకు తోడుగా నీడగా ఉన్న ఆపద్బాంధవుడు.

ఉత్తర భారతంలో కోసల రాజ్యం ఎంత బలమైందో, దక్షిణ భారతంలో కిష్కింధ అంతకంటె బలమైంది. వాలిని మించిన బలవంతుడు ఆ కాలంలో మరొకడు లేడు. ఆంధ్ర పౌరుష విరాట్ రూప లక్ష్మికి రామాయణం నాటి చరిత్ర పెట్టిన మణి కిరీటం కిష్కింధ.

త్రేతాయుగం నాటి దేశ చరిత్రను మనకు చెప్పగలది రామాయణం ఒక్కటే. అది మనకు కావ్యమూ, చరిత్రా, భూగోళమూ కూడ. అయితే, దానిని వ్రాసిన వాల్మీకి ప్రధానంగా కవి. మధుర భావాలు, సుందర వర్ణనలు, అద్భుత కల్పనలు ఎంతటి సహజ కవినైనా సమ్మోహన పరుస్తై.

అదీగాక, వాల్మీకి సర్వజ్ఞుడే కావచ్చు కాని, ప్రతి చిన్న అంశాన్నీ స్వయంగా చూడలేడు కదా ? కొంతవరకైనా శ్రుతం మీద ఆధారపడక తప్పదు.

ఉత్తర భారతీయులకు ఆనాడు దక్షిణాదిని గురించి తెలిసిం దెంత? అక్కడ వన నరులూ, రాక్షసులూ ఎక్కువగా వుంటారనేది. ఆ అడవుల్లో తపస్సు చేసుకొనే ఋషులను రాక్షసులు హింసిస్తారనేది. అంతే.

కిరాతులు, నిషాదులు, పుళిందులు, శబరులు, చెంచులు, బోయలు వంటి వాళందరూ వన నరులే. ఆంజనేయుడు, సుగ్రీవుడు అనే వన నరులు రామలక్ష్మణులతో స్నేహం చేసుకొన్నారని వాల్మీకి విన్నప్పుడు, వన నర శబ్దం ఆయనకు వానర శబ్దంగా వినబడి ఉండవచ్చు. లేక ఆయన కావాలనే వన నరను వానర చేసి ఉండవచ్చు. అంతేకాని, రామాయణ కాలంలో తోకలు కల మనుష్యులున్నా రనుకోరాదు.

కిష్కింధ రాజ్య పౌరులు వన నరులు. వారిలో ఎన్నో తెగ లుండవచ్చు. హనుమంతుడు కోతీ కాదు, జాంబవంతుడు ఎలుగు బంటీ కాదు. వాళ్ళూ మనుషులే. గిరిజనులు. జాంబవంతుడు హరిజను డనుకోవచ్చు కూడ, ఎందుకంటే, ఈనాడు హరిజనులలో అరుంధతీయుల వలెనే, జాంబవానులు కూడ ఉన్నారు.

హనుమ అన్ని విద్యలలోను ఆరితేరినవాడు. కవి, గాయకుడు. గొప్ప సంస్కృత భాషా పండితుడు. సంగీత శాస్త్రవేత్త. తత్వజ్ఞుడు. బ్రహ్మచారి. రామాయణం ఆరు కాండలలోను కిష్కింధా, సుందర కాండలు రెండింటికీ ఆంజనేయుడే నాయకు డనవచ్చు కూడ.

అంతటి లోకోత్తర సత్యశాలి వాలిని నిర్జించి సుగ్రీవుడికి న్యాయం చేకూర్చి వుండవచ్చు కదా ? అలా ఎందుకు జరగలేదు ?

పుట్టుకతోనే సర్వ శక్తి మంతుడై విజృంభించిన హనుమపట్ల దేవతలు భయమూ, ద్వేషమూ పెంచుకొని, ఆయనను బహువిధాలుగా హింసించడం జరిగింది. అంత చిన్న పిల్లవాణ్ణి ఇంద్రుడంతటివాడు వజ్రాయుధంతో కొట్టాడంటే ఆనాటి పరిస్థితిని ఊహించవచ్చు.

భౌతిక శక్తితో ఏమీ చెయ్యలేక, బాల హనుమను శపించారు. శపించడం చేతనైన కొందరు పెద్దలు "ఎవరైనా జ్ఞాపకం చేస్తే తప్ప, హనుమకు తన శక్తి తనకు గుర్తుండక పోవు గాక !" అని. శ్రీరాముణ్ణి కలుసుకునే వరకు ఆ శాపం పనిచేస్తూనే వున్నదనుకోవచ్చు.

ఆ శాపం సంగతి ఎవరికీ తెలియదు. ఒక్క వృద్ధ జాంబవంతుడికి తప్ప. జాంబవంతుడు కూడా హనుమ వలెనే అతిలోక శక్తిమంతుడు. ప్రాజ్ఞుడు. వివేకి. గరుత్మంతుడు పుట్టేనాటికే అతడు లోక విఖ్యాతుడు.

జాంబవంతుడు బ్రహ్మపుత్రుడు. తల్లిదండ్రులెవరో సూచన ప్రాయంగా నైనా తెలియనివాళ్ళు గొప్పవాళ్ళైనప్పుడు, అట్టి వాళ్ళను బ్రహ్మపుత్రులనే వాళ్ళనవచ్చు. అట్టి జాంబవంతుడు భల్లూక తెగ వారికి నాయకుడై, మూడు యుగాలపాటు రాజ్యపాలన చేసిన చిరంజీవి.

హనుమ సీతాన్వేషణలో సముద్రాన్ని లంఘించడానికి గాని, హిమాలయాల నుంచి ఓషధులను తెచ్చి లక్ష్మణుడికి, వానర సేనకూ బాధా విముక్తి కలిగించడానికి గాని జాంబవంతుడి సమయస్ఫూర్తే కారణం. రామదండులోని ఔషధీ విజ్ఞానులైన

జాంబవంతుడు, సుషేణుడు, ఇంజినీరైన నీలుడు మున్నగు వారంతా గిరిజన మేధావులే.

శ్రీరాముడికి మిత్రుడైన తర్వాత హనుమ క్రమంగా ఆయనకు నమ్మిన బంటూ, భక్తుడూ, మంత్రీ, సేనాధిపతీ, రాయబారీ, ఆత్మరక్షకుడూ అన్నీ తానే అయి, రాముడితో తాదాత్మ్యం చెందిన యోగబ్రహ్మ - శ్రీరాముడు ఆత్మ, హనుమ మనస్సు - వాటి సమన్వయ రూపమే పరమాత్మ.

హనుమ మృత్యుంజయుడు. చిరంజీవి. ద్వాపర యుగంలో పాండవులకు బాసటగా నిల్చినవాడు. ఈ నాటికీ ధైర్యసాహసాలకు, దుష్ట శిక్షణ, శిష్ట రక్షణలకు ప్రతీకగా ప్రజల మధ్య బ్రతుకుతున్న వాడు.

సుఫలీ కృత మార్తాండం
గోష్పదీకృత సాగరం
తృణీకృత దశగ్రీవం
ఆంజనేయం నమామ్యహం ॥

☆☆☆☆☆☆

# జాబాలి

జబాల పుత్రుడు జాబాలి. ఇతడికి తల్లి పెట్టుకొన్న పేరు సత్యకాముడు.

ఇతడు చదువుకోవడం కోసం హరిద్రుమతుడు అనే గురువు వద్దకు వెళ్ళాడు. గురువు గోత్ర మడిగాడు. కుల గోత్రాలు నాటికి, నేటికీ కూడ గుర్తింపు కార్డులే ! అది తన వద్ద లేదు.

తల్లి వద్దకు వెళ్ళి విషయం చెప్పాడు.

"అతిథి దేవోభవ" అనే సూత్రం అక్షరాలా అమల్లో వున్న సత్యకాలమది. ఇంటికి వచ్చిన అతిథికి భార్యను కూడ సమర్పించు కోవడం ఆనాటి ధర్మం. అట్టి ధర్మ నిర్వహణలో పుట్టిన పిల్లవాడికి తండ్రి ఎవరో ఖచ్చితంగా చెప్పడం కష్టం.

తమ కుల గోత్రాలేమిటో తమకు సిసలుగా తెలియవని, ఏదో చెప్పి పబ్బం గడుపుకోవడం తమ కిష్టం లేదనీ అన్నది జబాల. గురువు గారికి అలాగే చెప్పమన్నది.

కుర్రవాడు చెప్పిందంతా గురువు విన్నాడు. ఆలోచించాడు. అంత ఖచ్చితంగా సత్యానికి కట్టుబడి వుండటం కంటే ఏ మానవుడిలోనైనా కోరదగిన ఔన్నత్యం మరేముంటుంది ? జబాల కొడుకు జాబాలి. అతడు సత్యకాముడు. చాలు, కేవలం సత్యదీక్ష ఒక్కటే అర్హతగా, గుర్తింపు కార్డుగా జాబాలిని తన శిష్యులలో చేర్చుకున్నాడు హరిద్రుమతుడు.

అంత వరకు బాగానే ఉంది. అయితే, గురువుగా ఆయన చేసిన పనేమిటి? శిష్యుడికి పశుల కాపరి పని అప్పగించడం !

గురువు గారు తన కప్పగించిన గోవుల్ని అరణ్యానికి తోలుకు పోయి, అవి సహస్ర సంఖ్యను దాటేవరకు అక్కడే వుండిపోయాడు జాబాలి. అతడి కర్తవ్య నిర్వహణ దీక్ష అట్టిది. ఆ దీక్షకు, ఆ ఏకాగ్రతకు పంచభూతాలే జాగృతాలై, జిజ్ఞాసువులైనై, వాగ్దేవతలైనై !

"సత్యకామా !"

ఎక్కడి నుంచి ఆ అపూర్వ దివ్య సంబోధన ? అది మందలోని ఒక యువ వృషభం !

"సత్యకామా ! మేం సహస్రాధిక సంఖ్యాకులమైనాం. ఇక మమ్మల్ని గరువుగారికి అప్పగించు ! ఇదిగో, నీకు బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశిస్తున్నాం స్వీకరించు !" అన్నదా వృషభం – వాయు ప్రేరితమై !

అప్పుడు వృషభం, అగ్ని, సూర్యుడు, పక్షి, తలొక పాదం చొప్పున బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశించారు అతడికి - ఆ విధంగా కులగోత్రాలు లేని ఒక వ్యక్తి కేవలం నిష్ఠద్వారా, స్వానుభవంతో బ్రహ్మజ్ఞాని అయినాడు !

సృష్టి సమస్తమూ పరబ్రహ్మాత్మకమే అన్న ఎరుక స్వానుభవం వల్లనే గ్రహించిన జాబాలి, ఆ తర్వాత మానవ మనో దౌర్బల్యాలు కల్పించిన ఆచార సంప్రదాయాలను నిరసించిన మహర్షి అయాడు. దశరథుడి పురోహిత వర్గంలో ఒకడై, హేతువాద దృక్పథాన్ని రాజ్యపరిపాలనా వ్యవహారాలలో ప్రవేశపెట్టాడు. జీవిత నిర్వహణలో సెంటిమెంటుకు ప్రథమస్థానం ఇవ్వగూడదని శ్రీరాముడికి చెప్పగల్గిన మేధావి, తత్వవేత్త, నిర్భయుడు జాబాలి !

ఇక్కడొక సత్యాన్ని గుర్తించవలసివుంది. సత్యకాముడి పుట్టుకకు, మతంగుడి పుట్టుకకు పోలిక వుంది. సత్యకాముడి విషయంలో ప్రదర్శించిన ఔదార్యాన్నే సమాజం మతంగుడిపట్ల ప్రదర్శించివుంటే వేద జాతికి అంటరానితనం అనే తెగులు పుట్టివుండేదే కాదు !

# వీరబాహుడు

హరిశ్చంద్ర నాటకం చూడని వాళ్ళెవరూ వుండరు. హరిశ్చంద్రుడి కథ మార్కండేయ పురాణంలోది. ఈ పురాణాన్ని సంస్కృతంలో వ్రాసిన వ్యాసుడు. తెలుగులోకి అనువదించినవాడు మారన.

మనం పురాణాలను ఏదృష్టితో చదివినా, వాటిని ఆ పురాణ కాలం నాటి పరిస్థితుల దృష్ట్యా అవగాహన చేసుకోవాలి. అతిశయోక్తుల్ని, అద్భుత కల్పనల్ని గుర్తించి, వాటి ముసుగుల్లోని వాస్తవాలను దర్శించాలి. అందుకు సాంఘిక స్పృహ ఎక్కువగా అవసరం. అది మార్కండేయ పురాణం విషయంలో మరీ అవసరం.

ఏది సంభవం ? ఏది అసంభవం ? ఏది నిజం ? ఏది కల్పితం ? ఏది వూహ ? ఏది అసలు ? ఏది ప్రక్షిప్తం ? యదార్థ చరిత్రను చెప్పాలనుకున్నప్పుడు, ఈ సంగతులన్నిటినీ పరిశీలించవలసి వుంది.

ఆ కాలంలో, కాశీ పట్టణ వీధుల్లో, తనను తాను అమ్ముకొంటున్న హరిశ్చంద్ర చక్రవర్తిని కొనే వాళ్ళెవరూ లేకపోయినప్పుడు, కొన్నవాడు వీరబాహుడు. అంతటి ఉన్నతుడు, ధనికుడు అతడు.

హరిశ్చంద్రుడు అయోధ్యను పాలిస్తున్నప్పుడు పరీక్షో, కక్షో, సాధింపో ఏదైనప్పటికీ, విశ్వామిత్రుడు అతణ్ణి హింసించాలనుకొన్నాడు. ఒక రోజున వచ్చి, తాను చేయబోయే యజ్ఞానికి విరాళమడిగాడు. హరిశ్చంద్రుడు ఎంత కావలిస్తే అంత తీసుకు వెళ్ళమన్నాడు. తరువాత తీసుకుంటా నన్నాడు విశ్వామిత్రుడు.

మరొక రోజున పంటలు పాడుచేస్తున్న క్రూర జంతువుల్ని వేటాడే నిమిత్తం అడవికి వెళ్ళిన హరిశ్చంద్రుడి వద్దకు ఇద్దరు మాతంగ కన్యలు వచ్చి నాట్యం చేశారు. ఆయన మెచ్చి బహుమతు లివ్వబోతే వద్దని, తమను పెళ్ళాడ మన్నారు. అందు కాయన నిరాకరించగా, వాళ్ళు పోయి ఆ సమీపంలోనే వున్న విశ్వామిత్రుడికి ఫిర్యాదు చేశారు. వాళ్ళు తన కుమార్తెలనీ, వాళ్ళ కోరిక తీర్చి తీరవలసిందేనని విశ్వామిత్రుడన్నాడు. తన రాజ్యమైనా ఇస్తాను గాని, అలాంటి పని తాను చెయ్యనన్నాడు హరిశ్చంద్రుడు. అయితే, రాజ్యమే ఇవ్వమన్నాడు ముని.

తన రాజ్యమంతా మునికి ధారబోసి, భార్య చంద్రమతితోను, కొడుకు లోహితుడితోను అయోధ్యను విడిచిపోతున్న హరిశ్చంద్రుణ్ణి బాకీ గురించి అడిగాడు విశ్వామిత్రుడు. ఏం బాకీ ? అదే, తాను తర్వాత తీసుకువెళతానన్న ధనం ! ఎంత ? తాను కోరినంత ! ఒక అర్బుదం (పదికోట్ల బంగారు నాణాలు) !

బాకీ తీర్చడానికి ఒక నెల రోజులు గడువడిగాడు హరిశ్చంద్రుడు, ఎన్నో ఇబ్బందులు పడుతూ, భార్యా పుత్రులతో కాశీ నగరాన్ని చేరుకున్నాడు. వారి వెంట బాకీ వసూలు చేయడానికి విశ్వామిత్రుడు నియమించిన నక్షత్రకుడు కూడ ఉన్నాడు.

ఎలా తీరుస్తాడు బాకీ ? భార్యా పుత్రుల్ని కాలకౌశికుడనే బ్రాహ్మణుడికి అమ్మేశాడు. అతడిచ్చిన మూల్యం విశ్వామిత్రుడు కోరినంతగా లేదు. మరింకెలా? ఆ రోజుతో గడువు ముగుస్తుంది !

తనను తాను అమ్మకానికి పెట్టుకొన్నాడు హరిశ్చంద్రుడు. కాశీపుర వీథుల్లో ఎలుగెత్తి చాటాడా సంగతిని. వెల ఎంత ? ముని కోరినంత ధనం. ముని కోరుతున్నదెంత ? ఒక అర్బుదం ! ఒక మనిషికి అంత ధనం పోసి కొనడమా ? ఎందుకు పనికొస్తాడతడు ?

అతడు మామూలు మనిషి కాదయ్యా ! హరిశ్చంద్ర చక్రవర్తి ! అయితే, మరీ కష్టం ! అతడమ్ముడుపోవడం అసాధ్యం. ఎవడి దగ్గర వున్నదంత ధనం, తగలేసుకొనడానికి ?

హరిశ్చంద్రుడి చుట్టూ జనం మూగి చోద్యం చూస్తున్న ఆ సమయంలో, ఎదురుగా ఒక ఊరేగింపు వస్తూ ఉంది. అదేదో చండాల దేవుడి ఉత్సవం కావచ్చు.

చండాల జనం కొలిచే దేవుడు. చిందులతో, డప్పులతో, గరగలతో, కర్ర, కత్తిసాములతో, అరుపులతో కోలాహలంగా వుంది. దాని నాయకుడు వీరబాహుడు.

అతడు హరిశ్చంద్ర చక్రవర్తి అనే పేరు విన్నాడు. సంగతి తెలుసు కున్నాడు. జాలి పడ్డాడు. తాను కొంటానన్నాడు.

> *"నేను చండాలుడ, నృపవర ! పురమున*
> *వీర విఖ్యాతుడ ! ... ....*
> *ఎంత అర్థంబైన ఇచ్చి నిన్ను విలిచెద,*
> *చెప్పుమా వెల ? "* అన్నాడు.

అది చూచి హరిశ్చంద్రుడు "మాలను సేవించి మనుటకంటె, కౌశికోగ్ర శాపాగ్నికి" అహుతై పోవటమే మేలని భావించాడట !

అదే సమయంలో కౌశికుడు (విశ్వామిత్రుడు) అక్కడికి వచ్చి "ఏం? మాలడు మనిషి కాడా ? అతడు, కోరిన వెల ఇస్తానంటున్నాడు. ఒప్పుకో!" అన్నాడు.

అప్పుడు హరిశ్చంద్రుడు....

> *"ఇన వంశంబున బుట్టిన*
> *మనుజేంద్రుడ, అఖిల లోక మాన్యుడ, కొరమా*
> *లిన మాలని నకట, తపో*
> *ధన సత్తమ ! నిను గొలువ దగునే ?"*

> *"కరుణన్ జూడుము, కావు మిప్పుడు త్రిలో*
> *కస్తుత్య ! చండాల సం*
> *కర దోషంబును బొందకుండగ ననున్*
> *గై కొమ్ము నీ బంటుగా...'*

అంటూ, అమాంతం విశ్వామిత్రుడి కాళ్ళపై పడి, ఆయన రెండు కాళ్ళూ పట్టుకొన్నాడు.

విశ్వామిత్రుడు సరే అన్నాడు.

"ఇప్పుడు నీవు నా సేవకుడివి. కనుక ఈ మాలడికి నిన్ను అమ్మేస్తున్నాను"

అన్నాడు. అప్పుడా మాలడు మునికి ధనమిచ్చేశాడు. హరిశ్చంద్రుణ్ణి చేతి కోల తీసుకొని "బైతో లెగయంగ వ్రేసి, వెస దోడ్కొని పల్లెకు" పోయినాడట.

అక్కడ మాలపల్లెలో హరిశ్చంద్రుడు " నిరంతర వేదనానల దందహ్యమాన మానసుండగుచుండ". ఒక రోజున ఆయన వద్దకు వీరబాహుడు వచ్చి, "నీకు కాటికాపరి తనం ఇస్తున్నాను" అని తెలియజేశాడు. అక్కడ వసూలయ్యే ధనంలో ఆరో వంతు రాజుకు, మూడోవంతు తనకూ ఇచ్చి, మిగిలిన దానిని అనుభవించమన్నాడు.

ఆ విధంగా వీరబాహుడిచే నియమించబడి, హరిశ్చంద్రుడు శ్మశాన పాలకుడైనాడు.

ఇక్కడ మనం గుర్తించవలసిన ముఖ్యాంశాలు మూడున్నాయి.

వీరబాహుడి రూపాన్ని వికృతంగా వర్ణించడం జరిగిందే కాని, కాశీపట్టణ వీధుల్లో ఎక్కడా అంటరానితనం ఉన్నట్టు చెప్పలేదు. దేశం మొత్తంలో మాలవాడే అధిక ధనవంతుడని చూపబడింది. అధిక ఉదారుడని కూడ వివరించబడింది.

చంద్రమతిని కొన్న బ్రాహ్మణుడు ఆమెచేత, లోహితుడి చేతా హీనాతిహీనంగా చాకిరి చెయ్యించుకొన్నాడు. హరిశ్చంద్రుణ్ణి కొన్న మాలవాడు ఆయనను స్వతంత్రమైన ఒక పదవిలో నియమించాడు !

ఇక్కడ మరొక సత్యం ఆవిష్కరించబడింది. రూప వర్తనలు, వ్యక్తిని బట్టి మారుతూ వుంటాయనే దది. హరిశ్చంద్రుడికి వీరబాహుడి రూపం మొదట్లో ఎంత వికారంగా కనిపించిందో, అంతే వికారంగా తన రూపం మారింది. ఆ వృత్తిలో కొంతకాలం వున్న తర్వాత !

శ్మశానంలో తిరుగుతూ, అక్కడి పనులన్నీ చేస్తూ వున్న హరిశ్చంద్ర చివరకు "పెన్మాలతనమ్ము నొందె" నట ! "ప్రాణంబుతోడ జన్మాంత రంబును బొందె" నట!

కుల వ్యవస్థలోని గుట్టు ఇదీ. వీరబాహుడి పాత్ర ద్వారా వ్యాసుడు మానవులకు చేసిన హెచ్చరిక కూడా ఇదే !

# వేదవ్యాసుడు

వేద విభాగమున్ జరిపె
విశ్వము సర్వము ప్రస్తుతింప ; అ
ష్టాదశ సత్పురాణములు
శస్తమతిన్ విరచించె, సర్వ లో
కాదరణీయమైన ఇతి
హాసము భారతమున్ రచించె; అ
బ్జోదర వంశ సంభవము
నొందెను వ్యాసుడు నిమ్నజాతుడే.

(నిరుద్ధ భారతం)

"జాతో వ్యాసస్తు కైవర్త్యాః, శ్వపాక్యాస్తు పరాశరః" అంటూ తమ వంశ చరిత్రను గురించి వ్యాసుడే ఎంతో గర్వంగా చెప్పుకున్నాడు భారతేతిహాసంలో

తన తల్లి ఒక బెస్తకన్య అనీ, తన తండ్రి ఒక మాలపిల్ల కొడుకనీ, తన ముత్తవ్వ మాతంగి అనీ, ముత్తాత వేశ్యా పుత్రుడనీ తన రచనల నిండా, ఎక్కడ వీలైతే అక్కడ చెప్పుకొంటూ వచ్చాడు వ్యాసుడు. ఎందుకని ? తన కాలంలోని సాంఘిక వ్యవస్థ ఎంత విజ్ఞాన మూలకంగా వుండేదో తెలపడానికని!

కఠిన కులాలుగా కరడుగట్టుకుపోయి, ఒక్కొక్క కులం ఒక్కొక్క వైర జాతిగా విడిపోయి, భవిష్యత్తులో భారతీయత అంతఃకలహాలతో ఆత్మహత్య చేసుకొనే

అత్యాయిక స్థితి ఏర్పడినప్పుడు వేద జాతిని రక్షించడానికి, ఏకత్వాన్ని నిరూపించడానికి ఈ వాస్తవాలను ఆయన చెప్పుకొంటూ వచ్చాడనవచ్చు. జాతిని పునరుజ్జీవింపజేయడానికి అప్పుడు మనకు ఇవే అమృత గుళికలు.

ఈనాడు వేద వ్యాసుడి పుట్టుకకు సంబంధించి వివాదాలేవీలేవు. ఆయన అవ్వ, ముత్తవ్వ కూడ మాల మాదిగల ఆడపడుచులే. తల్లి కూడ కించిత్ వృత్తి భేదంతో అదే వంశానికి చెందిన మహిళ - నదీ సముద్ర తీరాలలోని ప్రజల వృత్తుల్ని పరిశీలిస్తే ఈ వాస్తవం నిర్ధారితమవుతుంది. పడవల, చేపల వృత్తులు అక్కడి ప్రజలందరికి సర్వ సాధారణం. ముఖ్యంగా మాలలకు.

యమునా నది రేవులో నావలు నడిపే విధి సత్యవతి కుటుంబం వాళ్ళది. వాళ్ళ ప్రధాన వృత్తి చేపల వేట. అందుకే వాళ్ళను బోయలు అనడం కూడ జరిగింది.

మగవాళ్ళు చేపల వేటకు పోయినప్పుడు, ఆడవాళ్ళు నావలు నడుపుతారు. అటువంటి ఒక సందర్భంలో, నదిని దాటడానికి వచ్చిన పరాశరుడు, పడవ నడుపుతున్న సత్యవతిని చూచి కామించి, ఆమె చెప్పిన అభ్యంతరాలన్నిటిని తన తపశ్శక్తిచే తొలగించి, అక్కడికక్కడ గాంధర్వ వివాహం చేసుకోగా, ఆమెకు వ్యాసుడు పుట్టాడు.

యమునా నది కృష్ణవర్ణ, కృష్ణ లంకలో పుట్టినవాడు కనుక కృష్ణద్వైపాయను డయాడతడు - పరాశరుని పుత్రుడు కనుక పారాశరి. సత్యవతి కొడుకు కనుక సాత్యవతేయుడు, వేదాలను విభజించినవాడు కనుక వేదవ్యాసుడు. బదరీ వాసి కనుక బాదరాయణుడు. ఇలా వ్యాసుడికి చాలా పేర్లున్నై. కడకు "వ్యాసో నారాయణో హరిః" అన్నంత ఉన్నతికి ఎదిగాడాయన. వ్యాసభగవానుడే అయాడు.

తలంచుకొన్న క్షణంలోనే తన వద్దకు రాగలనని తల్లికి వరమిచ్చి, చిన్నప్పుడే తపస్సుకు వెళ్ళిపోయాడు వ్యాసుడు. అప్పటి కతని పేరు అపాంతర తముడు.

అంతటి ప్రతిభావంతుడు, ఏక సంధాగ్రాహి, ధారణాధురీణుడు, మనీషి, మహిమాన్వితుడు, సర్వజ్ఞుడు, సగుణ బ్రహ్మ ఆనాడేకాదు - ఈనాటికి మరొకడు లేడంటే అది సహజోక్తి.

బ్రహ్మ తన నాలుగు ముఖాలతోను వేదాలను పలుకుతుంటే, వాటిని అంతే వేగంతో ఏ వర్గానికా వర్గంగా విభజించుకొంటూ జ్ఞాపకం పెట్టుకొని, ఆ తర్వాత శిష్యులకు ఏ వేదానికా వేదం బోధించగలిగాడంటే, వ్యాసుడి శక్తిని అంచనా వెయ్యగలవారెవరు ?

వాస్తవ పరిధిలో ఆలోచిస్తే ఆయన లోకం నలుదెసలా పర్యటించి, ఎక్కడెక్కడి వేదాలనూ సేకరించి, నాలుగు భాగాలుగా, వర్గాలుగా వేర్పరించా డనవచ్చు. ఆనాడాయనచేసిన కృషే భారత జాతి సంస్కృతికి ఆత్మ అయింది.

వేదాలను సేకరిస్తూ, విభజిస్తూనే, వ్యాసుడు వాటిని అవగాహన చేసుకొని, రకరకాల ప్రజలకోసం, రకరకాల ప్రక్రియలలో సాహిత్య సృష్టి చేశాడు. సామాన్యుల కోసం పురాణాలు, పండితుల కోసం ఉపనిషత్తులు, వేదాంతుల కోసం బ్రహ్మసూత్రాలు, విజ్ఞానుల కోసం వేదాంగాలు, లౌకికుల కోసం భారత, భాగవతాలు అలా వెలువడినట్టివే.

ఆయన సాహిత్యంలాగే ఆయన జీవితం కూడ బహుముఖ మైనట్టిది. నిజానికి ఆయన సాహిత్యమంతా ఆయన జీవిత చరిత్రే.

మత్స్యగంధి, యోజన గంధి అయిన సత్యవతి శంతన మహా రాజును పెండ్లాడటం, చిత్రాంగద - విచిత్రవీర్యులనే కొడుకులు పుట్టటం జరిగింది. చిత్రాంగదుడు పెండ్లి కాకుండానే పోగా, విచిత్రవీర్యుడు సంతానం లేకుండా పోయాడు. శంతనుడి వంశం అంతటితో అంతరించిపోకుండా వ్యాసుణ్ణి రప్పించి, అప్పటి ఆచారం ప్రకారం విచిత్రవీర్యుడి వితంతువులైన అంబికా, అంబాలికలను నియోగించిందామె. ఆ విధంగా ధృతరాష్ట్ర - పాండురాజులకు, విదురుడికి తండ్రి అయాడు వ్యాసుడు. ఆ విధంగా వ్యాసుడు కౌరవ - పాండవ వంశాలకు మూలపురుషుడయాడు.

వ్యాసుడు కామ గమనమూ, దివ్యదృష్టీ కల విశ్వ మానవుడు. తనతో ఆత్మానుసంధానం కల వాళ్ళెవరికైనా సరే, ఆపత్కాలంలో సహాయపడుతూ ఉండేవాడు. పాండవులకు సదా మంచి సలహాలతో మార్గదర్శకు డాయన. దుర్యోధనాదులు మాత్రం ఆయన మాటలు వినేవాళ్ళు కాదు.

కురుక్షేత్ర యుద్ధ సమయంలో ధృతరాష్ట్రుడికి దివ్యదృష్టిని ఇస్తా నన్నాడు వ్యాసుడు. అయితే, వార్తలు వినడాన్ని మాత్రమే కోరాడు ధృతరాష్ట్రుడు. అందుకోసం యుద్ధరంగంలో ప్రమాదం లేకుండా స్వేచ్ఛగా తిరుగుతూ వార్తలు సంగ్రహించగల శక్తిని సంజయుడి కిచ్చాడు వ్యాసుడు. ఆ విధంగా వ్యాసుడి వరం ద్వారా ప్రపంచంలో తొలి యుద్ధ విలేఖరి తానే అయాడు సంజయుడు.

వేద వ్యాసుడి ఆశ్రమం పేరు శమ్యాప్రాసం. తన సాహిత్యాన్ని ధారణ చేసి ప్రపంచమంతటా చాటగల శిష్యులనేకులు ఆయనకున్నారు. తాను విష్ణుభక్తుడైనా, హరిహరాద్వైతాన్ని బోధించి ఏకేశ్వరత్వాన్ని స్థిరీకరించిన సత్యద్రష్ట.

తనకెన్ని శక్తులున్నా, వ్యాసుడు ఎవరినైనా ఆశీర్వదించాడే కాని, శపించలేదు.

వ్యాసుడి కాలంలోనే సంకుచిత కుల వ్యవస్థకు బీజావాపనం జరిగింది. అది విషవృక్షం సుమా. దాని ఫలాలు సర్వనాశనం తెస్తాయి సుమా అంటూ హెచ్చరిస్తూనే వచ్చాడాయన తన సాహిత్యంనిండా. తన జన్మ చరిత్రనూ చెప్పుకొంటూ వచ్చాడు. అయితే, మానవ స్త్రీ గర్భం లాంటిదే కాల గర్భమూను!

ఆయన నిరన్తకామి. నిష్కామికాడు. ప్రపంచాన్ని ప్రేమించినవాడు. దాని వికాసానికి దోహదం చేసినవాడు. దుష్టులను మందలించినవాడు. దుఃఖితులను ఓదార్చినవాడు. తనకు ఘృతాచి స్నేహఫలంగా లభించిన కుమారుడు. శ్రీ శుకుణ్ణి బ్రహ్మవిద్య కోసం జనకుడి వద్దకు పంపించిన ఉచితజ్ఞుడు, చిరంజీవి వ్యాసభగవానుడు.

******

# ఏకలవ్యుడు

విద్యార్థికి స్పర్థ వుండాలి. మాత్సర్యం వుండకూడదు. పోనీ, తనకంటె అధికుడు మరొకడుండ కూడదనుకునే అర్జునుడి వంటి వాడొక డుంటే వుండవచ్చు గాక. కానీ, ద్రోణుడి వంటి స్వపర పక్షపాతం కలవాడు గురు స్థానంలో వుండవచ్చునా?

హిరణ్య ధన్వుడనే ఎరుక రాజు హస్తినాపురం సమీపంలోని అరణ్య ప్రాంతాన్ని పాలిస్తూ వుండేవాడు. హిరణ్య ధన్వుడంటే బంగారు ధనుస్సు కలవాడు అని అర్థం. పేరుని బట్టే అతడెంతటి గొప్ప విలుకాడో వూహించవచ్చు. కాగా, అతడి కొడుకు ఏకలవ్యుడు ద్రోణాచార్యుడి వద్ద విలువిద్య నేర్చుకోవాలనుకోవడం పేరాశ కాదు.

అయితే, ఏకలవ్యుడు ఎరుకల వాడని, నిషాదుడని తెలుసు కొన్న ద్రోణుడు అతణ్ణి శిష్యుడుగా గ్రహించడానికి అంగీకరించలేదు - కర్ణుడి విషయంలో కూడ అలానే ప్రవర్తించాడు ద్రోణుడు. ఆయనకు కావలసింది ప్రతిభ కాదు. కులం, జాతి !

ద్రోణాచార్యుల చేత ఆ విధంగా తిరస్కరించబడ్డ ఏకలవ్యుడు నిరాశ పడక, అరణ్యంలోకి పోయి -

"వినయమున ద్రోణు రూపు మన్నున అమర్చి,
దాని కతి భక్తితోడ ప్రదక్షిణంబు
చేసి మ్రొక్కుచు, సంతతాభ్యాసశక్తి
అస్త్రవిద్యా రహస్యంబులన్ని బడసె !"
(భారతం, ఆదిపర్వం)

మట్టితో ద్రోణుడి బొమ్మను చేసి, ఆ బొమ్మను గురుస్థానంలో నిలుపుకొని, విద్యాభ్యాసం చేశాడు. అస్త్రవిద్యా రహస్యాలన్నిటిని ఆ విధంగా హస్తగతం చేసుకున్నాడు.

గరువు దగ్గరుండి, ప్రతి సూక్ష్మ విషయాన్నీ స్వయంగా మననం చెయ్యించినా, విద్య స్వాధీనం కావడానికి చాలకాలం పడుతుంది – మేధావులకు సైతం - అటువంటప్పుడు, కొద్ది కాలంలోనే, కేవలం మట్టి బొమ్మను మాత్రమే గురువుగా ఊహించుకొని, అనన్య సాధ్యమైన అంతటి విలువిద్యను ఏకలవ్యుడు సాధించాడంటే, అతడెంతటి మహా మహి మాన్వితుడో ఊహించవచ్చు.

ద్రోణుడి వద్ద విద్య నేర్చుకొంటున్న కౌరవులూ, పాండవులూ ఒకనాడు వేట సరదాతో అరణ్యాలలో విహరిస్తున్నప్పుడు, వాళ్ళ వేట కుక్కల్లో ఒకటి మొగం నిండా బాణాలతో వాళ్ళ వద్దకు వచ్చింది. అంత గొప్పగా కుక్క నోరు మూయ గలిగిన విలుకాడెవరు ? అర్జునుడే గడ గడ వణికాడు ఆ దృశ్యం చూచి.

అందరూ కలిసి వెళ్ళి ఏకలవ్యుణ్ణి చూశారు. తన ఏకాంతాన్ని భగ్నం చేస్తూ ఆ కుక్క మొరగడం సాగించిందనీ, ఏడు బాణాలు దాని మొగాన కొట్టి నిశ్శబ్ద పరచవలసి వచ్చిందనీ ఏకలవ్యుడు చెప్పాడు. తన గురువు ద్రోణాచార్యు లన్నాడు. అంతే ! అర్జునుడి గుండెల్లో మొసళ్ళు మెదిలాయి.

వెంటనే హస్తినకు చేరి, ద్రోణుణ్ణి కలుసుకొన్నా డర్జునుడు. క్రోధంతో ఇలా అన్నాడు :

"ఏమయ్యా, అబద్ధాల కోరా! విలువిద్యనంతటినీ నా పరం చేస్తా నన్నావు. నన్ను మించినవాడు మరొకడు లేకుండా చూస్తానన్నావు. నాకంటె, నీకంటె కూడ అధికుడైన వాణ్ణి, త్రిలోకాలను ఒక బాణం దెబ్బతో గెలువగల వాణ్ణి ఒకణ్ణి అడవిలో చూశాం. అతడు నీ శిష్యుడట!"

అదిరిపడ్డాడు ద్రోణుడు అర్జునుడి మాటలకు. వెంటనే వెళ్ళి ఏకలవ్యుణ్ణి కలుసుకొన్నాడు. ఏకలవ్యుడు భక్తి ప్రపత్తులతో ద్రోణుడికి ప్రణమిల్లి, జరిగినదంతా చెప్పి, తన విద్యనంతా ప్రదర్శించి చూపాడు.

"నా విద్యా గురువు తమరే" అన్నాడు.

"అయితే, నాకు నీ గురుదక్షిణ ?" అన్నాడు ద్రోణుడు. చేయి చాపుతూ.

ఎంతో ఆనందంతో పరవశించి పోయాడు ఏకలవ్యుడు. ద్రోణాచార్యుల వారు అంత కాలానికైనా తన శిష్యరికాన్ని అంగీకరించి నందుకు సజల నేత్రుడైనాడు.

వినయ విధేయతలతో చేతులు మోడ్చి, ఏకలవ్య డన్నాడు:

"ఇది దేహం, బది యర్థం,
బిది నా పరిజన సమూహ, 'మన్నిటిలో నె
య్యది మీ కిష్టమొ దానిని
ముద మొదవగ నిత్తు, కొనుడు..."

(భారతం, ఆదిపర్వం.)

అంతే! ఒక్క క్షణం కూడ ఆలోచించకుండా కోరేశాడు ద్రోణుడు తన గురుదక్షిణను, "నీ కుడిచేతి బొటనవ్రేలు కోసి ఇవ్వు!" అంటూ!

ద్రోణుడలా అనగానే, ఏకలవ్యుడు చిరునవ్వుతో పొదిలోని బాణాన్ని దూసి, తన కుడి బొటన వ్రేలిని ఖండించి, నెత్తురోడుతున్న దాన్ని ద్రోణుడి చేతిలో పెట్టి, నమస్కరించి, ఎటో వెళ్ళిపోయాడు.

వేదవ్యాసుడు ఈ ఉదంతాన్ని ఎందుకు చెప్పాడో, నన్నయభట్టు ఎందుకు అనువదించాడో మరి !

అమాయకులు, నిజాయితీ పరులు, ధర్మవ్రతులు అయిన ఆటవికులను స్వార్థపరులు, వంచకులు అయిన నాగరికులు ఎంత నిర్ధయగా, అమానుషంగా హింసించగలరో ఈ గాధ హెచ్చరిస్తున్న దనడం మాత్రం నిజం !

తన బడిలో చేర్చుకోడానికీ నిరాకరించిన జాత్యంహకారి గురు దక్షిణ కోరడం ! విద్యార్థి స్వయంకృషితో నేర్చుకొన్న విద్యను వంచనతో ధ్వంసం చెయ్యడం !

మహత్తర ప్రజ్ఞాశాలి అయిన ఏకలవ్యుడు లాంటివాడు ఏ బొమ్మను పెట్టుకొని సాధన చేసినా, ఏ విద్యనైనా సాధించగలడు. అందుకు ఎవరికీ శ్రుతిమించిన కృతజ్ఞత చూపనవసరం లేదు.

☆☆☆☆☆☆☆

# గురు మనీషి

ఆది శంకరాచార్యుణ్ణి గురించి తెలియనివారు ఈ దేశంలోనే కాదు. ప్రపంచంలో మరెక్కడా లేరు. వేదాంతంలో అద్వైత సిద్ధాంతానికి ప్రవర్తకు డాయన.

హిందూమత పునరుద్ధరణ కోసం చిన్నప్పుడే సన్యసించిన వాడాయన. వేద వేదాంగాలన్నీ క్షణ్ణంగా పరిశీలించినవాడు. ఏ మత శాస్త్ర విజ్ఞానంలోను ఆయనతో వాదించి నిలవగలిగిన పండితులాకాలంలో లేరు.

శంకరాచార్యుడు కేవలం పండితుడూ, మేధావి మాత్రమే కాదు - ప్రతిభావంతుడైన మహాకవి - యోగ విద్యానాథుడు. పుంభావ సరస్వతి. ఒక మహోద్యమానికి దీక్షాకంకణం ధరించిన వీరమూర్తి.

కావచ్చు కాని....

శూన్యవాదం వరకు ఎదిగిన బౌద్ధ మేధావుల్ని ఆ మాత్రం వైదుష్యంతో ఎదిరించి శంకరాచార్యుడు నిలవగలిగే వాడేనా ?

చండాలుడే గనక ఆ రోజున శంకరాచార్యుడికి ప్రత్యక్షంగా అద్వైతాన్ని బోధించి వుండకపోతే, చరిత్ర మరొక విధంగా వుండి వుండేది. శంకరాచార్యుడు ఒక సనాతన వేద పండితుడుగానే మిగిలిపోయేవాడు. బౌద్ధాన్ని జయించగలిగేవాడు కాదు.

ఎవరా చండాలుడు ? ఒక మాలమాదిగవాడు. ఆ కాలం నాటి ఒక అస్పృశ్యుడు. అతణ్ణి చండాలు డనడమే తప్ప, అతడి పేరు ఏమిటో ఎవరూ చెప్పలేదు.

ఒక రోజున సన్యాసి, పండితుడు, నైష్ఠికుడు, కులాచార బద్ధుడు అయిన శంకరాచార్యుడు కాశీ పట్టణంలో, గంగా మార్గంలో పోతూ వుంటే, ఆయనకు ఎదురుగా వస్తున్నా డొక చండాలుడు. అతణ్ణి చూడగానే అసహ్యంతో కంపించిపోయా డాయన.

"హే, చండాలాధమ ! ఇతో గచ్ఛ ! గచ్ఛ ! (ఓరి చండాలాధముడా! తొలగిపో ! తొలగిపో !)" అని అంటూ అరిచాడు.

చండాలుడు నిలబడిపోయాడు. తొలగిపోలేదు. ప్రశాంతంగా ఇలా అన్నాడు.

"యతివరా ! నీవు తొలగి పొమ్మంటున్నది శరీరాన్నా ? ఆత్మనా ? మనిద్దరి శరీరాలు అన్న రసం నుంచి పుట్టినట్టివే - అన్నమయ కోశాలే - రెంటికీ ప్రస్తుతః భేదం లేదు. ఒకదాని నుంచి మరొక దానిని పొమ్మనడంలో అర్థం లేదు. ఇక, ఆత్మ నుంచి ఆత్మను తొలగి పొమ్మంటున్నావా ? మనిద్దరి ఆత్మలు ఒకే పరమాత్మ కాదా ? 'ఏకో దేవః సర్వభూతేషు' అనే సత్యం నీ అవగాహనకు ఇంకా అందలేదా ? ప్రజ్ఞానంతో చూడు. ఆనందబ్రహ్మలో ఎవడు బ్రాహ్మడు, ఎవడు చండాలుడు ?"

ఇలా చండాలుడు చెప్పుకుపోతుంటే, శంకరాచార్యుడి చిదాకా శంలో జ్ఞానోదయ మవుతూ వచ్చింది. ఆలోచన రేకెత్తింది. అంత వరకు ఆయన గతానుగతికంగానే పోతున్నాడు. ఆగి ఆలోచించలేదు. చివరగా ఆయన చండాలుడితో ఇలా అన్నాడు:

"అయితే, నీ కుండకూ, నా కమండలువుకూ తేడాయే లేదంటావా?"

"తేడా ఏమున్నదో నీవే చెప్పు" అన్నాడు చండాలుడు. "పాత్ర మట్టిది కావచ్చు. బంగారుది కావచ్చు. తోలుది కావచ్చు. పేరేదైనా కావచ్చు అన్నిటిలోదీ గంగాజలమైతే, అది పవిత్రమే. కమండలువైనా, అందు మురికినీరైతే, అది అపవిత్రమే. ఆలోచించు" అన్నాడు.

"అన్ని పాత్రలలోను అన్ని ఖండాలుగా ప్రతిబింబించే ఆకాశం, పాత్రలు పోయినప్పుడు ఒక్కటే కాదా" అన్నాడు.

ఒక మహత్కార్యం కోసం విషయ సుఖాలన్నిటినీ వదులుకొన్న పరమత్యాగి శంకరాచార్యుడు. చండాలుడి పట్ల తాను కనబరచిన అహంకారానికి, తమోగుణ వికారమైన అంటరాని తనానికి పశ్చాత్తాప పడ్డాడు. తన కమండలువులోని గంగా జలం చండాలుడి కాళ్ళపై వంచేసి, సాష్టాంగ పడ్డాడు---

**"చండా లోస్తు సతు ద్విజోస్తు గురు రి**
**త్యేషా మనీషా మమ !"** అంటూ.

ఆనాటి ఆ సంఘటనను వర్ణిస్తూ, ఇదే మకుటంతో అయిదు శ్లోకాలను వ్రాశాడు శంకరాచార్యుడు. ఈ శ్లోకాలే "మనీషా పంచకం" అనే పేరుతో ప్రసిద్ధమైనై.

ఏ కులభేదాల కారణంగా హిందూ ధర్మం క్షీణించిపోయిందో, ఆ కుల భేదాలను నిర్మూలించకుండా తన ఉద్యమం విజయవంతం కాదనే వాస్తవాన్ని శంకరాచార్యుడిలో కలిగించిన వాడు చండాలుడే, శంకరుడికి చండాలుడు అద్వైత వేదాంత గురువే కాదు - హైందవ మతోద్ధరణ విజయానికి మార్గదర్శి కూడా.

అంతటి గురువు పేరేమిటో కనుక్కోలేదు శంకరాచార్యుడు. అందువల్ల నేనే సూచిస్తున్నా నతడి పేరు "గురు మనీషి" అని.

☆☆☆☆☆☆

# పుల్కసుడు

రంతిదేవుడనే రాజు ఒకప్పుడు ఒక గొప్ప యజ్ఞం చేశాడు. ఆ యజ్ఞంలో రోజుకి రెండువేల గోవుల చొప్పున వేల్చి సంతర్పణ చేసేవాడు. ఆ గోవుల చర్మాలను ఒక గుట్టగా పడేస్తే, ఆ గుట్టలో నుంచి ఊరిన నీరు ఒక నదిగా ప్రవహించి గంగానదిలో కలిసింది. ఆ నది పేరు చర్మణ్వతి. ఇప్పుడు చంబల్ అంటున్నాం. ఆ ప్రాంతమే నేటి చంబల్ లోయ.

ఏ యజ్ఞమైనా, అది పరిసమాప్తమయ్యేటప్పటికి ఆ యజ్ఞకర్త తనకున్న సమస్తమూ దానం చేసెయ్యవలసి వుంటుంది. రంతిదేవుడు కూడ అలానే చేశాడు.

యజ్ఞం సమాప్త మయిన తర్వాత, అతడు ఏకాంతంగా కూర్చుని భోజనానికి ఉపక్రమించాడు. సమస్తమూ దానం చేసిన తర్వాత భోజనం అంటే కేవలం మంచినీళ్ళు మాత్రం. వాటిని తాగా లనుకుంటుండగా అక్కడికి ఒక పుల్కసుడు వచ్చి 'ఆకలిగా ఉంది, ఏమైనా పెట్టండి' అన్నాడు. పుల్కసుడు అంటే చండాలుడు, నేటి భాషలో హరిజనుడు.

అప్పుడా రాజు....

అన్నము లేదు కొద్ది మధు
రాంబువు మాత్రము త్రావుమన్న, రా
వన్న ! శరీర ధారులకు
ఆపదవచ్చిన వారి ఆపదల్

క్రన్నన దాల్చి వారికి సు
ఖమ్ములు కూర్చుట కంటె ఒందు మే
లున్నదె ? నాకు దిక్కు పురు
షోత్తము డొక్కడె సుమ్ము, పుల్కసా !

అంటూ తాను త్రాగబోతున్న మంచినీటిని కూడ అతడికి ఇచ్చేశాడు.

అంతవరకు బాగానే ఉంది.

అయితే....

ఇక్కడ నేను చెప్పదలచిన దేమి టంటే...

ఒక చండాలుడు అతి పవిత్రమైన యజ్ఞవాటికలోని రాజు భోజనం చేసే అంతఃపురందాకా ఎలా రాగలిగాడూ అని... రాగలిగాడు సరే. అతడు అలా వచ్చినందుకు రాజు విసుక్కోలేదు. రానిచ్చినందుకు తన భటులపై కోపపడనూ లేదు. మంచినీళ్ళు ఇచ్చేశాడు. పుల్కసుడు తాగేసి వెళ్ళి పోయాడు.

అంతా సహజంగానే జరిగిపోయింది. అంటే, ఆ కాలంలో వర్ణభేదమే కాని, అంటే వృత్తి భేదమే కాని, అంటరానితనం లేదన్నమాటే కదా ?

పాలకుడు, బిచ్చగాడు – ఇద్దరి నడుమ వృత్తిభేదం వుంది. ఆర్థిక వ్యత్యాసం వుంది. మానవులుగా ఇద్దరూ సమానులే.

వీరబాహుడి కథలో కూడా అంటరానితనం వున్నట్టు లేదు. కాశీ పట్టణ వీధుల్లో వీరబాహుడు స్వేచ్ఛగా విహరించినవాడు కదా !

☆☆☆☆☆☆☆

# సత్య తపుడు

సత్యతపుడు ఒక బోయవాడు. అతడి అసలు పేరేమిటో తెలియదు. సత్యమే లక్ష్యంగా తపస్వి అయినవాడు కనుక ఆ పేరు వచ్చిందను కోవచ్చు.

అతడు దారిదోపిడీల ద్వారా మార్గస్థులను దోచుకొనడంలో హింసించే వాడు. చంపేసేవాడు. అలా ఎంతోమందిని చంపాడు. అతడి జీవిత చరిత్ర కొద్దిగా వాల్మీకి జీవిత చరిత్రను పోలి ఉంటుంది.

ఒకసారి అరుణి అనే మునిని దోచుకోబోయి, ఆ ముని చలించకుండా వున్నప్పుడు, చంపుతానని బెదిరించాడు. అయినా ఆ ముని బెదరలేదు. సత్యతపుడు ఆశ్చర్యపడి మునికి శిష్యుడు కాగోరాడు. ముని అతణ్ణి లెక్కచేయక తన దారిని తాను పోయాడు. సత్యతపుడు వెంట పడ్డాడు.

అలా పోగా పోగా, ఒక పులి హఠాత్తుగా అరుణి మీద దూకింది. సత్యతపుడు మెరుపువేగంతో పులిని ఎదిరించి చంపేశాడు. అప్పుడు అతడిపై మునికి వాత్సల్యం కలిగి "నీ వెప్పుడూ సత్యమే పలుకు" అని ఉపదేశించి, పోయి తపస్సు చేసుకోమన్నాడు.

ఆ తరువాత అతడి చరిత్ర చాలానే వుంది.

ఒకసారి ఒక పంది పరుగు పరుగున వచ్చి అతడి ఆశ్రమం వెనుక పొదలో

దాక్కుంది. అంతలో దానిని తరుముకుంటూ వచ్చిన ఇద్దరు ఎరుకల వాళ్ళు సత్యతపుణ్ణి సమీపించి, అటుగా వచ్చిన పందిని చూశారా అని ప్రశ్నించారు. ఏం చెప్పాలో అతడికి తోచలేదు. చూడలేదంటే అసత్య మవుతుంది. చూశానంటే తన ఆశ్రయం లోని పంది ప్రాణం పోతుంది. అప్పుడతడన్నాడూ....

"కళ్ళు చూశాయి. కానీ అవి చెప్పలేవు. నోరు చెప్పగలదు. కానీ అది పందిని చూడలేదు" అని.

అతి తెలివితో చెప్పిన సమాధానం ఈనాడైతే అటువంటి సమా ధానానికి లభించే ప్రతిఫలమేమిటో మనందరికి తెలుసు. అయితే ఆ సమాధానానికి ఆ ఎరుకలు చాలా సంతోషించారట. ఆ ఇద్దరూ ఇంద్రుడు, ఉపేంద్రుడుగా తమ నిజ స్వరూపాలతో దర్శనమిచ్చి సత్యతపుడికి వరాలు దయచేశారట.

గమ్మత్తేమిటంటే – శివుడూ, ఇంద్రాది దేవతలూ మానవ రూపాలు ధరించవలసి వచ్చినప్పుడు మాలమాదిగలుగానూ, ఎరుకలు, చెంచులు గానూ తయారౌతారు. ఎందుకని ? సనాతన భారతదేశంలో అన్ని రంగాలలోనూ ఈ రెండు వర్గాలవాళ్ళే అగ్రగాములూ, అధినాయకులూ కాబట్టి.

☆☆☆☆☆☆

# పాశుపత బోయ

ఈనాడు హరిజనులనీ, గిరిజనులనీ పిలువబడుతున్న వాళ్ళే ఆనాడు చండాలురనీ, భిల్లులనీ పేర్కొనబడ్డారు. చండాలురకు చాలా పేర్లు వున్నట్టే భిల్లులకూ చాలా పర్యాయ పదాలున్నై. చండాలురను తెలుగులో దళితులనీ, మాల మాదిగలనీ అంటున్నాం. భిల్లులను బోయలు, చెంచులు అంటున్నాం. ఈ రెండు వర్గాలు ఒకే జాతికి చెందినవాళ్ళు.

*"ఉల్లమునందు అక్కటిక*
*మూనుట మీ కులమందు గంటి మం*
*చల్లన మేల మాడు నచ*
*లాత్మజ మాటకు లేత నవ్వు సం*
*ధిల్ల గిరీటి బాశుపత*
*దివ్య శరాఢ్యుని జేయు శాంబరీ భిల్లుడు... "*

అంటూ అల్లసాని పెద్దన కవి తన మనుచరిత్ర కావ్యంలో ఏ భిల్లుడిని ప్రశంసించాడో ఆ భిల్లుడే కిరీటికి అంటే అర్జునుడికి పాశుపతాస్త్రాన్ని బహూకరించిన భిల్లుడు.

మహాభారత యుద్ధంలో అవసరానికి వాడుకోవడం కోసం పాశుపతాస్త్రాన్ని సంపాదించాలనుకొన్నారు పాండవులు. దానికోసం అర్జునుడు తపస్సు చేశాడు.

శివుడు బోయవాడి రూపంలో వచ్చి అర్జునుడి బలాన్నీ, అర్హతనూ పరీక్షించి, పాశుపతాస్త్రాన్ని ఇచ్చాడని కథ.

సాక్షాత్తు పరమేశ్వరుడే ప్రత్యక్షమవడంలోని వాస్తవాన్ని హేతువాదులు తోసి పారవేయవచ్చు. అయితే ఒక భిల్లుడు వచ్చి తన వద్దనున్న పాశుపతాన్ని అర్జునుడికి బహూకరించాడనడంలో యదార్థం వుండే వుండవచ్చు. అంటే ఆనాటి భిల్ల జాతి మహా శక్తివంతమైనట్టిదనీ, భిల్ల వీరుల వద్ద అత్యంత శక్తివంతమైన అస్త్రాలూ, శస్త్రాలూ అనేకం వుండేవనీ, వాళ్ళకు దయ కలిగితే ఇతర జాతి వీరులకు కూడా వాటిని బహూకరించే వాళ్ళనీ ఈ ఉదంతం వల్ల మనకు స్పష్ట పడుతుంది.

ఇక్కడ మరో విశేషమేమిటంటే, పరమేశ్వరుడైన శివుడు మానవ రూపాలు ధరించగలడనీ, పూర్వం ధరించేవాడనీ మనం నమ్మితే, ఆయనెప్పుడూ చండాలుడిగానూ (శంకర గురువు), బోయవాడుగానూ (పాశుపతదాత) దర్శనమిస్తాడు. అందుకు కారణం బహుశా వాళ్ళంటే ఆయనకు ఎక్కువ అభిమానం అయినా కావచ్చు, ఆయన వాళ్ళ జాతికి చెందినవాడు కాబట్టి అయినా కావచ్చు. ఈ వాస్తవాన్ని ఇంకా లోతుగా పరిశీలించవలసి వుంది.

☆☆☆☆☆☆

# ఆహుక - ఆహుకుడు

ఆహుక, ఆహుకుడు - ఈ ఇద్దరూ బోయ దంపతులు. శివ భక్తులు. ఆ కాలంలో ఆటవిక తెగలు చాలవరకు శివభక్తులే అయి వుండడం గమనార్హం. శివుడు ఆటవిక జాతివాడై వుండడమే అందుకు కారణం అనవచ్చు. పార్వతి - గిరిజ కూడా గిరిజన తెగలకు చెందినదే కదా ?

ఒకనాడు రాత్రివేళ శివుడు వృద్ధ యతి రూపంలో ఆహుకుడి కుటీరానికి వచ్చాడు. ఆతిథ్యం అయిన తరువాత ఆ వృద్ధ యతి తిరిగి వెళ్ళిపోయే అవకాశం లేకపోయింది. కుటీరంలో ముగ్గురికి చోటు చాలదు. భార్యా భర్తలలో ఎవరో ఒకరు బయట పండుకోక తప్పదు. నేనంటే నేనని వారిద్దరూ పోటీపడిన తరువాత, చివరకు భర్తే బయటపడుకొన్నాడు.

అర్ధరాత్రి వేళ ఒక పులి అతన్ని (ఆహుకుణ్ణి) ఎత్తుకు పోయింది. ప్రాంగణమంతా అతడి రక్త మాంసాలతో భీభత్సంగా వుంది. భర్తృ వియోగాన్ని భరించలేక ఆహుక చితి పేర్చుకుని ఆత్మాహుతికి సిద్ధపడింది. అప్పుడు యతి నిజరూపం ధరించి, వాళ్ళ భక్తికి మెచ్చి ఆహుకుణ్ణి సజీవంగా రప్పించి, వాళ్ళకు ఒక వరం కూడా ఇచ్చాడు - మరు జన్మలో ఆ ఇద్దరూ నల దమయంతులుగా పుడతారని.

పునర్జన్మ సిద్ధాంతం కేవలం కల్పితం అని భావించే నేను వాస్తవం గురించి ఆలోచించినప్పుడు నా కనిపించిందేమిటంటే - ఆనాటి దమయంతీ, నలుడూ కూడా బోయజాతికి చెందిన వాళ్ళే అని. ఆనాటి భారతీయ రాజులు, చక్రవర్తులు అందరూ మొత్తం మీద హరిజన, గిరిజన తెగలకు చెందిన వాళ్ళేనని.

నలుడు నిషధకు రాజు. నిషాదులు బోయలే.

## భ్రాంత మతి

వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు మొదలైన హైందవ ప్రాచీన సాహిత్యంలోని పాత్రలను పరిగణనలోకి తీసుకొన్నప్పుడు నా పద్ధతి ఒకటుంది. పూర్వజన్మలు, శాపాలు, ఒక జన్మనుంచి మరొక జన్మకు ముడిపెట్టడాలు, శాప విమోచనాలు, జన్మాంతర వైరాలు మొదలైన ఊహా జనిత మిథ్యా సందర్భాలను వదిలేస్తాను. ఆ పాత్రలను యథార్థ మానవ వ్యక్తులుగానే తీసుకొంటాను. నా సాహిత్యాన్ని చదివే ఎవరైనా ఈ వాస్తవాన్ని గుర్తించవలసివుంది.

శ్రీకృష్ణుణ్ణి చంపినవాడు ఒక బోయ.

ద్వారకానగరంలోని యాదవకులం వీరులందరూ పరస్పరం నిందించుకొని, కొట్టుకుని చచ్చిన తరువాత, ఆ ఘోరం చూడలేక బలరాముడు కూడా మరణించిన తరువాత, దిక్కుతోచని కృష్ణుడు అరణ్యంలోకి పోయి ఒక చెట్టుకింద శయనించి విచారించసాగాడు. ఒక మోకాలు మీద ఒక మీగాలును వేసుకొని, బొటనవేలును ఆడిస్తూ జరిగిన విపత్తును గురించి ఆలోచించ సాగాడు. అప్పుడు మహావేగంతో ఒక బాణం వచ్చి అరికాలులో దిగి మోకాలిగుండా దూసుకుపోయింది. దానితో కృష్ణుడు ప్రాణాలు వదిలాడు.

ఆ బాణం వేసినవాడు ఒక బోయ, కదులుతున్న బొటన వేలుని ఒక జింక తల అని భ్రాంతిపడ్డాడట. జింకని కొట్టడానికి బాణం వదిలాడు. ఆ బాణం ఎంత బలమైనదో మహాభారతం మౌసలపర్వంలోని తిక్కనగారి పద్యం చూడండి.

ధరణీనాథ యతండు శాతశర ము
దృద్వృత్తి సంధించి యు
ద్ధుర భంగిం దెగ నిండగా దిగిచి య
త్యుగ్రంబుగా నేసె నా
హరి శ్రీపాద తలంబు దూరగొని య
య్యస్త్రంబు మీగాల ని
ష్ఠుర వేగంబున నుచ్చి పోయె వెన వా
దుం జేరె గైకొంటకున్.

ఆ తరువాత కృష్ణణ్ణి వెతుక్కుంటూ ఆ అడవిలో దిక్కు తోచక తిరుగు తున్న అర్జునుడికి కృష్ణుడు పడిఉన్న చోటును చూపిన వాడు కూడా ఒక బోయవాడే. బహుశా అదే బోయవాడు కావచ్చు.

అంటే - కృష్ణుడి కోసం ప్రత్యేకంగా నిర్మించబడిన ద్వారకలో సైతం, ఆ ప్రాంతపు అడవులలో బోయలు కూడా వున్నారన్నమాట. ఆ బోయ బాణాలు కృష్ణణ్ణి కూడా చంపగలిగినంతటి ఉజ్జ్వలమై నట్టివన్నమాట.

గ్రీకు సాహిత్యంలో ఒక యోధ పాత్రతో ఈ విషయంలో మన కృష్ణ పాత్రకు పోలిక ఉంది. ఎఛిలస్ ఆయుఃస్థానం అతని కాలిసీలమండలో వుంటే, కృష్ణుడి ఆయుఃస్థానం అతని అరికాలులో వుంది.

బోయల పరాక్రమ శక్తి ఆ తరువాత అర్జునుణ్ణి ఓడించడంలో కూడా ద్యోతకమవుతుంది. ద్వారకలోని మిగిలిన పౌరులనూ, అంతఃపుర కాంతలనూ, ధన కనక వస్తు వాహన సర్వ సంపదనూ ద్వారక నుంచి తరలించి ఒడ్డెక్కిన అర్జునుడిపై తీరంలోని బోయలు దండెత్తి, అతడి అస్త్రశస్త్రాలను నిర్వీర్యం చేసి సంపదనంతా దోచుకు పోయారు. బహుశా తమ వంశీయుడైన ఏకలవ్యుడికి జరిగిన అన్యాయానికి ఈ విధంగా అర్జునుడిపై పగ తీర్చుకొన్నారేమో అనిపిస్తుంది.

కృష్ణణ్ణి చంపిన బోయవాడి పేరు నాకెక్కడా కనిపించలేదు. అందుకే నేను అతణ్ణి భ్రాంతమతి అని పేర్కొంటున్నాను.

# శివుడు

త్రిమూర్తులలో శివుడు లయకారుడు. ఆది భిక్షువు. కాటి కాపరి. కాటి కాపర్లు హరిజనులు, నేను ఈ హరిజన గిరిజన పురాణ పురుషుల్లో శివుణ్ణి కూడా చేర్చడాని కదే కారణం.

శివుడు నటరాజు. ఆయనకు ప్రియమైన వాద్యాలు బుడబుక్క (డమరు), కొమ్ముబూర. ఇవి రెండూ హరిజనులు వాడేవే. అచ్చు శివుడి వేషంతో, బుడబుక్క వాయించుకొంటూ, గారడీలు చేసుకుంటూ కాటికాపరి గాళ్ళు (బుడబుక్కల వాళ్ళు) మాలమాదిగ పేటల్లో తిరుగుతూ వుండడం ఒక నిత్య దృశ్యం.

తాండవం శివుడికి ప్రియమైన నాట్యలీల. అది ఉగ్రహేల. దాని రంగం అపరిమితమూ, అపారమూ, దాని పరిమిత సూక్ష్మరూపమే చిందు. దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేస్తూ శివుడూ, వీరభద్రుడూ వేసినవి చిందులే. తాండవ సూక్ష్మమైన ఈ చిందు హరిజనులకు సాంప్రదాయకంగా వస్తున్న క్రీడ - కోపం వచ్చినప్పుడు ప్రతివాళ్ళూ చిందులు త్రొక్కుతారు. హరిజనులు మాత్రం కళగా ఆరాధిస్తారు.

క్షుద్రశక్తులు, చిల్లర దేవుళ్ళు, భూత ప్రేత పిశాచాలు తరచుగా పీడించేది అమాయకులైన నిమ్న వర్గాల వాళ్ళనే. అట్టి దుష్ట గ్రహాల నుంచి ఈ దీన జనుల్ని నిరంతరంగా కాపాడుతున్న నాయకుడు శివుడే. దక్షయజ్ఞం లాంటి అనేక సందర్భాలలో జరిగిందేమిటి? శివుడికి అవమానమే కదా ? సభలకు పిలవరు. యజ్ఞ ఫలాలలో భాగం పెట్టరు. శ్మశాన వాటికల్ని దాటి రానివ్వరు. దీనంతటికి

కారణం ఒక్కటే. ఆయన ఎవ్వరికీ తలవంచ డనేది. ఎందుకు వంచాలి? ఎవరేం ఉద్ధరిస్తున్నారని ?

శివుడు వరాలు ఎక్కువగా రాక్షసులకే ఇచ్చాడు. వాళ్ళలో ఎక్కువమంది వాటిని దుర్వినియోగం చేశారు.

ఎంతో తపస్సు చేస్తారు. వరాలు పొందుతారు. దానితో కళ్ళు మూసుకుపోతాయి. దుర్మార్గాలు చేస్తారు. తమ నాశనాన్ని తామే కొని తెచ్చుకుంటారు. శివుడేం చెయ్యగలడు ?

భస్మాసురుడు తనకు వరమిచ్చిన శివుడి నెత్తినే చేయి పెట్టడానికి యత్నించాడు. కృతఘ్నత కది పరాకాష్ట. రావణుడు ఒక ప్రక్క శివపూజ చేస్తూనే మరో ప్రక్క శివుణ్ణి అవమానించేవాడు. ద్రోహానికది పరాకాష్ట. శివుడి గురించిన ఇలాంటి కథలు అసంఖ్యాకం.

శివుడు భక్త సులభుడు. భోళా శంకరుడు. సముద్ర మథన మప్పుడు లక్ష్మిని విష్ణువూ, అమృతాన్ని దేవతలూ తీసుకొని, విషం మింగి లోకాన్ని రక్షించవలసిన బాధ్యతను మాత్రం శివుడికి అప్పగించారు. అయితే, శివు డిలాంటివేమీ పట్టించుకోడు.

ఆయనకు సూర్య చంద్రులిద్దరూ రెండు కళ్ళు. అగ్ని మూడో కన్ను. అయితే, ఒక్క మన్మథుడి మీద తప్ప మరెవరి మీదా ఆయన దాన్ని ప్రయోగించినట్టు లేదు.

శివుడేపని చేసినా విశ్వ శ్రేయస్సు కోసమే చేశాడు. పురాణ సంఘటనలన్నీ అదే చెపుతున్నై. ఆకాశగంగను భూమి మీదకు దింపడం సామాన్య కార్యమా ?

అన్నిటికంటే ముఖ్యమైన వాస్తవం ఒకటుంది. లోకానికి ఒక నీతినో, ఒక వేదాంత సూత్రాన్నో, ఒక జీవిత రహస్యాన్నో బోధించవలసి వచ్చినపుడు శివుడు తప్పకుండా చండాలుడుగా మారే వాడు. చండాలుడైనా అయేవాడు, [illegible] అయినా అయేవాడు. ఇందుకు ఉదాహరణలు పురాణాల నిండా వున్నై.

శివుడి వేషమే ఒక అద్భుతం. పైని చంద్రుడు, క్రింద పాములు! తలపై గంగ, నొసట అగ్ని! మొలకు చర్మవస్త్రం, చేతిలో బుడబుక్క, కాళ్ళకు గజ్జలు! ప్రక్క అర్ధాంగి గిరిజ, వాహనం ఎద్దు! కుమారులలో గజముఖుడి వాహనం ఎలుక, షణ్ముఖుడి వాహనం నెమలి! ఈ కుమారు లిద్దరూ దత్తపుత్రులే! ఆది దంపతులు జగత్పితరులు. లోక మంతా వారి సంతానమే. సొంత బిడ్డలున్న తల్లి జగన్మాత కాజాలదు. తండ్రి జగత్పిత కాజాలదు కదా ?

సృష్టిలో గల వైరుధ్యాలన్నిటికి సమన్వయ క్షేత్రం, సహజీవన రంగం శివుడు! అందుకే అయన విశ్వైక సామ్యవాది! యూనివర్సల్ సోషలిష్టు!

మానవ సమాజంలో ఆధిక్యతతో బ్రతకడం కోసం స్వార్థ పరులైన బలవంతులు కల్పించిన వర్గ వర్ణ తారతమ్యాలన్నిటినీ, నిమ్నోన్నతాలన్నిటినీ చదును చేసేది మృత్యువొక్కటే. దాని కధి నాథుడు శివుడంటే. సర్వాంతర్యామి అయిన పరమాత్మకు ఆయన ఎంతటి సహజ రూపకల్పనో ఊహించవచ్చు.

మరొక విషయ మేమిటంటే ప్రపంచంలోని మొట్టమొదటి మతం శైవమే. మానవులలో ఊహలు పెరిగే కొలదీ, మానవులు కొన్ని కొన్ని ముఠాలుగా ఏర్పడే కొలదీ, నాయకత్వ వ్యవస్థ రూపం దిద్దు కొన్న కొలదీ ప్రవక్తలు తలెత్తడం, వివిధ మతాలు ఏర్పడడం జరిగింది. ఒకొక్క ప్రవక్తమాట ఒకొక ముఠా ప్రజల్లో వేదమై చెల్లింది. ఆ విధంగా ఎందరో ప్రవక్తలూ, ఎన్నో మతాలు ఏర్పడినప్పటికీ మౌలికమైన శైవం, దాని ప్రతీక అయిన శివలింగం నేటికీ ప్రపంచమంతా చెక్కుచెదరకుండా వుంటూనే వున్నై.

అట్టి శివుడు, ఈశుడు, ఈశ్వరుడు, ఆయన భార్య పర్వత రాజ పుత్రి, మాతంగి ఇద్దరూ కూడా వేష భాషలలోను, వృత్తి విహారాలలోను హరిజనులే. నేను హరిజనుడిగా పుట్టినందుకు ఇంతగా గర్వపడేది అందుకే.

☆☆☆☆☆☆